

భక్తిశ్రద్ధలతో సత్యదేవుని వ్రతాలు

● కిక్కిరిసిన ఆలయాలు

అనంతపురం టౌన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం జిల్లావ్యాప్తంగా వాడవాడలా సత్యదేవుని వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాలు కిక్కిరిశాయి. అనంతపురంలోని అశోక్‌నగర్‌లోని సత్యదేవుని ఆలయంతోపాటు షిర్డీసాయిబాబా మందిరాల్లో సత్యనారాయణస్వామికి ప్రత్యేక అలంకరణలు చేశారు. వేదపండితులు వ్రత విశిష్ఠతను వివరిస్తుండగా భక్తులు సామూహికంగా వ్రతాలను ఆచరించారు. హరిహర దేవాలయంలో శ్రావణ పౌర్ణమి సందర్భంగా హయగ్రీవస్వామికి భక్తుల చేతులమీదుగా పంచామృతాభిషేకాలు చేయడంతోపాటు ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.



అశోక్‌నగర్ సత్యదేవుని మందిరంలో దర్శనమిస్తున్న రమాసమేత సత్యనారాయణ స్వామి, సామూహికంగా సత్యదేవుని వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు



జలపాతం కోనవిందు..!

యాడికి మండలంలోని కోన రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద జలపాతం కనువిందు చేస్తోంది. నంద్యాల జిల్లా సరిహద్దుల్లో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురవడంతో వర్షపునీరు కోన రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న కొండలపై నుంచి దూకుతోంది. ఏటా వర్షాకాలంలో జీవం పోసుకునే ఈ జలపాతం.. ఈ ఏడాది కాస్త ఆలస్యంగా జలకళను సంతరించుకుంది. మరో మూడు నెలలపాటు నీరు పారే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. యాడికి మండల కేంద్రం నుంచి 15 కి.మీ. దూరంలో ఉన్న ఈ జలపాతం వద్దకు వెళ్లడానికి రోడ్డు సౌకర్యం బాగుంది. వాహనాలు సొంతంగా తీసుకువెళ్లాల్సిందే. జలపాతాన్ని చూసేందుకు ఉమ్మడి అనంత, కర్నూలు, కడప జిల్లాల నుంచి పర్యాటకులు తరలివస్తారు.

-ఆంధ్రజ్యోతి, యాడికి

చూడండి సర్.. మీరిచ్చిన నీరు..!



రాగులపాడు వద్ద నీటి పంపింగ్‌ను పరిశీలిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్(ఫైల్)

వజ్రకరూరు మండలంలోని రాగులపాడు వద్ద హంద్రీనీవా ఎత్తిపోతల పథకం నుంచి 10 మోటార్లతో నీటిని పంపింగ్ చేసే వీడియోను సీఎం చంద్రబాబుకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పంపించారు. ఈ వీడియోను చూసి సీఎం సంతోషం వ్యక్తం చేసినట్లు మంత్రి శనివారం తెలిపారు. హంద్రీనీవా కాలువను వెడల్పు చేసి, 10 మోటార్లతో నీటి పంపింగ్ చేసేలా చర్యలు తీసుకున్న సీఎం చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. హంద్రీనీవా కాలువలో పుష్కలంగా నీరు వస్తోందని, ఇందుకు ఆనందంగా ఉందని మంత్రి తెలిపారు. అనంతపురం జిల్లాకు ఇంత పెద్ద ఎత్తున నీటిని తీసుకురావడం సంతోషంగా ఉందని సీఎం తనకు రిప్లై ఇచ్చారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే ఆరు మోటార్ల నుంచి 12 మోటార్లను వాడుకునేలా కాలువ సామర్థ్యాన్ని రెండింతలు పెంచామని అన్నారు. ప్రస్తుతం కాలువలో రెండింతల సామర్థ్యంతో నీరు ప్రవహిస్తోందని అన్నారు. - ఆంధ్రజ్యోతి, ఉరవకొండ

వైసీపీ పాపాలు..!

అహుడా పరిధిలో కుప్పలు తెప్పలుగా అనధికార లే అవుట్లు

- 700కిపైగా అనుమతులు లేనివే..
- అధిక భాగం వైసీపీ హయాంలో వేసినవే..
- క్రమబద్ధీకరణకు ససేమిరా
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి



అనధికార లేఅవుట్‌లో రాళ్లను తొలగిస్తున్న అహుడా అధికారులు (ఫైల్)

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో భూఅక్రమాలకు అంతేలేదన్నది బహిరంగ రహస్యమే. భూకబ్జాలతో పేట్రేగిపోయారు. ఆ పార్టీకి చెందిన నేతలు.. రియల్టర్ల అవతారమెత్తి నిబంధనలకు తిలోదకాలిచ్చారు. యథేచ్ఛగా అక్రమ లేఅవుట్లు వేసి, అడ్డంగా దోచుకున్నారు. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొట్టారు. కూటమి ప్రభుత్వం లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం (ఎల్‌ఆర్‌ఎస్)ను అమలులోకి తేవడంతో అక్రమాలు బయటపడుతున్నాయి. 2019-24 మధ్య వైసీపీ పాలనలో అనంతపురం హిందూపురం పట్టణాభివృద్ధి సంస్థ (అహుడా) పరిధిలో 700కిపైగా లేఅవుట్లు 8వేల ఎకరాల్లో విస్తరించినట్లు సమాచారం. వీటిలో 80శాతానికిపైగా వైసీపీ నేతలకు చెందినవే కావడం గమనార్హం. గత వైసీపీ ప్రభుత్వంలోనే విజిలెన్స్ అధికారులు.. అనధికార లేఅవుట్లపై నివేదిక ఇచ్చినా బుట్టదాఖలు చేశారు. దీంతో కూటమి ప్రభుత్వం అనధికార లేఅవుట్లను కట్టడి చేసి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న వెంచర్లను క్రమబద్ధీకరించే పనిలో పడింది. ఈ ప్రక్రియలో అసలు విషయం బయటకు వస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో అహుడాలోనే పనిచేస్తున్న ఓ ఇంజనీరు.. వైసీపీ నేతలతో అంటకాగినట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం వచ్చినా ఆ ఇంజనీరును అహుడాలోనే కొనసాగిస్తుండడం గమనార్హం. ఎల్‌ఆర్‌ఎస్‌ను పూర్తి స్థాయిలో తీసుకుంటే ఉమ్మడి జిల్లాలో 700కిపైగా ఉన్న అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొన్న (మిగతా 9వ పేజీలో..)

రేపు కలెక్టరేట్‌లో పరిష్కార వేదిక

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికను ఈనెల 11న కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ శనివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు ఇవ్వవచ్చని సూచించారు.

కలుషితం లేనోళ్లు గిరిజనులు

● పిల్లలను బాగా చదివించుకోవాలి

● డీఆర్వో మలోల సూచన ● ఘనంగా అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం



మన్యం వీరుడిగా డీఆర్వో మలోల

అనంతపురం విద్య, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కలుషితం లేనోళ్ల గిరిజనులని డీఆర్వో మలోల కొనియాడారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నగరంలోని గిరిజన భవనంలో వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. తొలుత అంబేడ్కర్, అల్లూరి సీతారామరాజు, ఏకలవ్య, బిర్సాముండా చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీఓ మాట్లాడుతూ.. గిరిజనులు కష్టజీవులన్నారు. ఆర్థిక అభివృద్ధికి నోచుకోవట్లేదన్నారు. గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయనీ, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లలను తప్పకుండా చదివించాలని గిరిజనులకు డీఆర్వో సూచించారు. గిరిజన నాయకులు మాట్లాడుతూ.. జిల్లాకేంద్రంలో ఏకలవ్య విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలనీ, అట్రాసిటీ కేసుల్లో బాధితులకు పరిహారం చెల్లించాలనీ, సబ్‌ప్లాన్ నిధులు అభివృద్ధికి ఉపయోగించాలని కోరారు. సమావేశంలో గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఆర్డీఓ కేశవనాయుడు, ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, తహసీల్దార్ హరికుమార్, పాల్గొన్నారు.

వైభవంగా బొలికొండ రంగనాథుడి కల్యాణం



స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకుడు, కల్యాణానికి హాజరైన భక్తులు



గుత్తిరూరల్, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): మండలంలోని జక్కలచెరువు గ్రామంలో వెలసిన బొలికొండ రంగనాథస్వామి ఆలయంలో శనివారం కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా వేకువజామున స్వామివారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన చేశారు. వివిధ పుష్పాలతో అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు శాంతి హోమం చేపట్టారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత బొలికొండ రంగనాథ స్వామి ఉత్సవమూర్తులకు అర్చకులు కల్యాణం నిర్వహించారు. స్వామి వారిని ఎమ్మెల్యే జయరాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ దర్శించుకున్నారు. కల్యాణాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సాయంత్రం ఉత్సవమూర్తులను పల్లకిలో కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి ఊంజల సేవ చేశారు. రాత్రి రాష్ట్రస్థాయి భజనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ శోభ, అర్చకులు రవిస్వామి, నవీన్, చేతన్ పాల్గొన్నారు.

సున్నం వేశాడు..!

సున్నా డౌన్ పేమెంట్, సున్నా వడ్డీతో కార్లు ఇప్పిస్తానంటూ మోసం

డ్రైవర్లకు రూ.3 లక్షలకు కుచ్చుటోపీ

పోలీసులను ఆశ్రయించిన బాధితులు

(వివరాలు 9లో...)

నిరాటంకంగా సాగునీరు

● విప్ కాలవ శ్రీనివాసులు ● పంటలకు నీటి విడుదల

కణేకల్లు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): అన్ని మరమ్మతులు పూర్తి చేసి, ఆయకట్టుకు నిరాటంకంగా నీరిస్తామని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. కణేకల్లు శ్రీ చిక్కణ్ణేశ్వర వడియార్ చెరువు 3 తూముల వద్ద పొలాలకు సాగునీటిని ఆయన శనివారం విడుదల చేశారు. విప్ మాట్లాడుతూ.. హెచ్చెల్సీతో సక్రమంగా నీరు పారేలా రూ.35 కోట్లతో మరమ్మతులు పూర్తి చేశామన్నారు. విపత్కర పరిస్థితిల్లోనూ హెచ్చెల్సీ రైతులకు నీరు అందించామన్నారు. కార్యక్రమంలో హెచ్చెల్సీ డీఈఈ దివాకర్ రెడ్డి, ఏఈఈ నరేంద్ర, మారుతి, చెరువు సంఘం అధ్యక్షుడు బీటీ రమేష్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



నీటిని విడుదల చేసున్న విప్ కాలవ శ్రీనివాసులు

జై హనుమాన్

కసాపురం, మురడి, నేమకల్లు ఆలయాలు కిటకిట

(వివరాలు 9లో..)

వేతనం ఎప్పుడో..?

● పది మూల్యాంకనం ముగిసి నాలుగు నెలలు ● నేటికీ అందని వేతనం.. పట్టించుకోని విద్యాశాఖ (9లో...)



వర్సిటీకి సున్నం

ఫీజు చెల్లింపు చలానాల్లో తేడాలు

తక్కువ చెల్లించి.. సున్నాలు చేర్చి మాయ

పరిశీలనలో వెలుగులోకి విద్యార్థుల అక్రమాలు

విచారణకు కమిటీ వేసిన ఎస్కేయూ అధికారులు



శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం

అనంతపురం రూరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మార్కులు తక్కువగా వచ్చినప్పుడు ఇంట్లో తల్లిదండ్రులు మందలిస్తారని భయపడి.. ప్రోగ్రెస్ రిపోర్ట్‌లో దిద్దుకునే విద్యార్థులను చాలా మంది చూసి ఉంటారు. సున్నాలు చుట్టడం, సున్నాను ఎనిమిదిగా మార్చడం, ఒకటిని ఏడుగా మార్చడం.. ఇలాంటి బురిడీ కొట్టించే సన్నివేశాలు చాలా సినిమాల్లో కూడా చూసే ఉంటారు. ఇలాంటివి పాఠశాల స్థాయిలో చిన్నారులు చేసే చిలిపి చేష్టలుగా భావిస్తారు. ఇలాంటి పనులే కాలేజీ స్థాయిలో చేస్తే..? అందులోనూ ఫీజులు కట్టే చలానాల్లో సున్నాలు చేర్చి.. వందలను వేలుగా మారిస్తే..? నేరమని తెలియక చేశారని క్షమించాలా..? దండించి.. దారిలో పెట్టాలా..? ఉన్నతాధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోగానీ.. ఎస్కేయూలో జరిగిన ఈ 'మస్కా' వ్యవహారం వెలుగులోకి వచ్చింది. వర్సిటీ అధికారులు విచారణకు ఓ కమిటీని ఏర్పాటు చేశారు.

పరిశీలనలో వెలుగులోకి..

ఎస్కేయూ ఫార్మసీ కళాశాలకు కొందరు విద్యార్థులు ఫీజుల చెల్లింపుల్లో అక్రమాలకు పాల్పడ్డారు. ప్రవేశ సమయంలో వసతి గృహాల్లో చేరే విద్యార్థులు ఫీజులను బ్యాంకుల్లో చలానా రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. చలానా పత్రాలను వసతి గృహ కార్యాలయం, కాలేజీలో సమర్పించాలి. ఇదే అదనుగా కొందరు తక్కువ ఫీజు చెల్లించి.. రిసిప్ట్‌లో సున్నాలను చేర్చి.. ఎక్కువ ఫీజు చెల్లించినట్లు బురిడీ కొట్టించారు. కాలేజీలో సమర్పించిన రిసిప్ట్‌లలో సున్నాలు చేర్చిన విషయం వెలుగులోకి వచ్చింది. వర్సిటీలో కళాశాలలు, వసతి గృహాలు ఇటీవల ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో ఫీజులు, ఇతర ధ్రువ పత్రాల పరిశీలన జరుగుతోంది. ఈ సమయంలో బోగస్ చలానాల అంశం బయటపడినట్లు తెలుస్తోంది. వసతి గృహం, ట్యూషన్ ఫీజు రిసిప్ట్ వెరిఫికేషన్‌లో అదనపు సున్నాలను గుర్తించారు. వాటిని తీసుకుని బ్యాంకులో విచారించారు. చలానాల్లో తేడాలు నిజమేనని నిర్ధారించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. చలానాలు మాన్యువల్ కావడంతో విద్యార్థులు ఈ విధంగా బురిడీ కొట్టించినట్లు తెలుస్తోంది.

జీరో బిజినెస్..!

కళాశాల అధికారులు, సిబ్బందిని కొందరు విద్యార్థులు సున్నాలతో బురిడీ కొట్టిస్తున్నారు. ఓ విద్యార్థి రూ.500 ఫీజు చెల్లించి.. చలానా రిసిప్ట్‌లో మూడు సున్నాలను అదనంగా చేర్చాడు. ఇలా ఏకంగా రూ.50 వేలు చెల్లించినట్లు కాలేజీలో చూపించాడు. మరో విద్యార్థి రూ.1400 చలానా కట్టాడు. ఒక సున్నా అదనంగా చేర్చి.. రూ.14 వేలు చెల్లించినట్లు రిసిప్ట్ సమర్పించాడు. కళాశాలలో మరో ముగ్గురు విద్యార్థులు ఇలా చేసినట్లు అధికారులు గుర్తించారు. ఒక్క ఫార్మసీ కళాశాలలోనే కాదని, విశ్వవిద్యాలయంలోని పలు కళాశాల్లో ఇలాంటివి ఉన్నాయని సమాచారం. దీంతో వర్సిటీ ఉన్నతాధికారులు పూర్తిస్థాయి విచారణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న ఆ విద్యార్థులు, కొందరు సంఘాల వారు వర్సిటీ ఉన్నతాధికారులను కలిసినట్లు తెలిసింది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకోవాలని నాయకులు కోరినట్లు తెలుస్తోంది.

ఆరుగురితో కమిటీ..

విశ్వవిద్యాలయంలోని ఫార్మసీ కళాశాలలో బోగస్ చలానాలను గుర్తించాము. రిసిప్ట్‌లో సున్నాలు చేర్చి కాలేజీలో అందజేశారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపిస్తున్నాం. ఆరుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశాం. ఫార్మసీ కళాశాలతో పాటు బీఈడీ, ఇంజనీరింగ్ తదితర కళాశాలల్లోనూ కమిటీ సభ్యులు విచారిస్తారు. నివేదిక వచ్చాక చర్యలు తీసుకుంటాము.

-రమేష్ బాబు,
రిజిస్ట్రార్, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం

దండించాడని... దాడి

బాధితుడి మృతి.. 24 గంటల్లో నిందితుడి అరెస్టు

(9లో...)



www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
అనంతపురం ● శింగనమల ● రాప్తాడు
ఆదివారం, 10 ఆగస్టు 2025
6 వపేజీ


శిల్పారామంలో వాహనాన్ని ప్రారంభిస్తూ...తానే స్వయంగా డ్రైవ్ చేస్తున్న దగ్గుపాటి

ప్రగతి రథసారథి.. దగ్గుపాటి

ముఖంపై చెరగని చిరునవ్వు..! చెప్పే మాటలో స్పష్టత..! చేసే పనుల్లో నిజాయతీ..! అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ గురించి మూడే మూడు వాక్యాల్లో చెప్పమని ఎవరైనా అడిగితే.. ఇలా చెప్పొచ్చు..! సమస్యల పరిష్కారం కోసం వచ్చేవారు ఎవరైనా సరే.. ఆయన ఆప్యాయంగా పలకరిస్తారు. సావధానంగా విని భరోసా ఇస్తారు. మాట ఇస్తే చేసే తత్వం ఆయనది. దశాబ్దాల అనుభవం ఉన్న కీలక నాయకులు కొలువైన అనంతపురం నగరంలో రాజకీయం నిత్యం వైకుంఠపాళి మాదిరిగానే ఉంటుంది. ఆడటం, నిలవటం, నిచ్చెనలు ఎక్కడం, పాములను తప్పించుకోవడం 'తొలిసారి ఎమ్మెల్యే'కి అంత సులువు కాదు. ఎన్నికల బరిలో దిగడంతోనే ఆయనకు సవాళ్లు ఎదురయ్యాయి. నిలిచి.. గెలిచారు. ఆట కొనసాగిస్తూనే ఉన్నారు. సమస్యలను ఒక్కొక్కటిగా దాటుకుంటూ నియోజకవర్గాన్ని అభివృద్ధి నిచ్చెనలను ఎక్కిస్తున్నారు. రాజకీయ చతురత, అభివృద్ధిపై దూర దృష్టి, సంక్షేమం అమలులో మానవీయత కనబరుస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం క్రైం



136 మంది కళ్లలో ఆనందం

పార్టీ నాయకులు, కార్యకర్తలు, సామాన్య ప్రజలు ఎవరైనా సాయం అడిగితే ఎమ్మెల్యే దగ్గుపాటి వెంటనే ముందుకొస్తారు. ప్రమాద బాధితులు, అనారోగ్య సమస్యలతో బాధపడేవాళ్లు ఎవరైనా ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్) ద్వారా సాయం చేయాలని అడిగితే.. వెంటనే ఫైల్ కదిలిస్తారు. సీఎంఆర్ఎఫ్‌కు వివరాలు పంపి నిధులను వెంటనే మంజూరు చేయిస్తారు. అనంతపురం అర్బన్‌లోని 50 డివిజన్లతోపాటు 4 పంచాయతీల పరిధిలో ఏకంగా 136 మందికి సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందించారు. రూ.1.75 కోట్ల సీఎంఆర్ఎఫ్ చెక్కులకు ఎమ్మెల్యే నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు.

ముఖ్యమంత్రి చంద్రబాబుకు అనంతపురం అర్బన్ సమస్యలపై వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

అధినేత, యువనేత చూపిన బాటలో...


అనంతపురం అర్బన్‌కు సంబంధించిన అంశాలపై విద్యాశాఖ మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

శాసనసభ ఎన్నికల బరిలో ఆయన కేవలం 40 రోజుల ముందు అడుగుపెట్టారు. 40 ఏళ్ల అనుభవంతో పండిపోయిన పొలిటికల్ స్ట్రాటజిస్టులు నివ్వెరపోయేలా గెలుపు బావుటా ఎగరేశారు. గెలిచిన తరువాత ఏడాదిలోనే అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో అభివృద్ధికి బాటలు వేస్తున్నారు. మొత్తంగా.. దగ్గుపాటి.. ఘనాపాటి అనిపించుకుంటున్నారు. 'చీకటితో వెలుగే చెప్పెను నేనున్నాని.. నీకేం కాదని..' అన్నట్లుగా అభాగ్యులు, పేదలకు అక్కున చేర్చుకుంటున్నారు. 'అడగాలేగానీ.. అన్నీ ఇచ్చే అన్నయ్యనవుతా..' అన్నట్లుగా పార్టీ శ్రేణులను, కార్యకర్తలను కలుపుకుంటూ ముందుకెళ్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువనేత, మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో ఎప్పటికప్పుడు అనంతపురం అర్బన్ సమస్యలను పరిష్కరిస్తున్నారు. సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటున్నారు. పరిష్కారాలు అన్వేషిస్తూ.. ముందుకు అడుగేస్తున్నారు. వచ్చిన ఏడాది కాలంలోనే అర్బన్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో రూ.122.85 కోట్ల విలువైన అభివృద్ధి పనులతో ప్రగతి జ్యోతులను వెలిగించారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యేగా ఎన్నికన తొలి ఏడాదిలోనే చెరగని ముద్ర వేశారు. అభివృద్ధి విషయంలో తనదైన బ్రాండ్ ఉంటుందని నిరూపించుకున్నారు. 'దటీజ్ దగ్గుపాటి' అని అందరూ మెచ్చుకునేలా తనను తాను నిరూపించుకుంటున్నారు.


ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి


సీఎంతో-ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్

మీ ఇంటికి మీ ఎమ్మెల్యే.. ఓ వినూత్న ప్రయత్నం

పొలిటికల్ లీడర్లు ఎవరైనా ఎమ్మెల్యే అవ్వడమే టార్గెట్ అనుకుంటారు. శాసనసభలో 'అధ్యక్షా..?' అని ఒక్కసారైన గళం విప్పాలని అనుకుంటారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మళ్లీ ఐదేళ్లకుగానీ ప్రజలకు కనపడని వారు ఎందరో ఉన్నారు. గెలవగానే సొంత పనులు చూసుకుంటారు. రిలాక్స్ అవుతారు. కానీ దగ్గుపాటి ఆ జాబితాలో లేరు. నిత్యం జనంలోనే ఉంటున్నారు. అందరిలాగే ఎమ్మెల్యే అవ్వాలని కలలుగన్నారు. కల నిజమయ్యాక.. తాను ఎమ్మెల్యేగా ఎందుకు గెలవాలని అనుకున్నానో.. గెలిస్తే.. ప్రజా సమస్యలను ఎలా పరిష్కరించగలనో, ప్రజలకు ఎంత చేరువగా ఉండగలనో అని నిరూపించుకున్నారు. డ్రీమ్, డిజైర్‌ను సాకారం చేసుకున్నారు. ఎమ్మెల్యే అయిన రెండు నెలల్లోనే మళ్లీ ప్రజల్లోకి వెళ్లాలని సంకల్పించారు. ఏ మాత్రం ఆలోచించలేదు. 'మీటింటికి మీ ఎమ్మెల్యే' అంటూ వినూతన్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 2024లో గెలిచిన రెండు మాసాల్లోకి మళ్లీ ప్రజలను కలిసేందుకు అడుగేశారు. ఇంటింటికీ తిరిగారు. 50 డివిజన్లలో, 4 పంచాతీయల్లో ప్రజలను కలిశారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యను తెలుసుకుని, అక్కడి నుంచే నేరుగా అధికారులకు ఫోన్లు చేసి, సమస్యలకు పరిష్కారం చూశారు. ఇతర ఎమ్మెల్యేలు సైతం 'అరే.. మనం కూడా అలా చేద్దాం. ప్రజలను నేరుగా కలుద్దాం' అనేలా స్ఫూర్తిగా నిలిచారు.


ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

40 రోజుల్లో.. ఏళ్ల రాజకీయం బద్దలు

- ఏడాదిలోనే అనంతపురంలో అభివృద్ధి పనులు
- అర్బన్‌లో ఇప్పటికే రూ.122.85 కోట్ల ప్రగతి కాంతులు
- రూ.31.01 కోట్ల జనరల్ ఫండ్స్‌లో రోడ్లు, కాలువలు, పార్కులు
- రూ.15.51 కోట్ల ఎన్‌సీఏపీ నిధులతో డెవలప్‌మెంట్ వర్క్స్
- రూ.15.35 కోట్ల అమృత్ నిధులతో అభివృద్ధి పనులు
- జల్ జీవన్ కింద మరో రూ.14.5 కోట్లతో కూడా..!
- రూ.12.21 కోట్లతో డంపింగ్ యార్డ్ సమస్యకు పరిష్కారం
- నాలుగు పంచాయతీల్లో రూ.9 కోట్లతో సీసీ రోడ్లు
- 136 మందికి రూ.1.75 కోట్ల సీఎంఆర్ఎఫ్ సాయం
- రూ.వందల కోట్ల పనులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు

● రూ.122.85 కోట్ల ప్రగతి కాంతులు

అనంతపురం అర్బన్ ఒక నియోజకవర్గం మాత్రమే కాదు. జిల్లా కేంద్రం కూడా..! ఇలాంటి కీలక ప్రాంతంలో వచ్చిన ఏడాది కాలంలోనే ఎంతగానో అభివృద్ధి చేశారు ఎమ్మెల్యే దగ్గుపాటి. తొలిసారి శాసనసభ్యులైనా, సీనియర్ ఎమ్మెల్యేలతో పోటీ పడుతూ ప్రగతి పరుగులు పెట్టిస్తున్నారు. అనంతపురం నగరంలోని 50 డివిజన్‌లు, అనంతపురం రూరల్, రుద్రంపేట, నారాయణపురం, రాజీవ్ కాలనీ పంచాయతీల్లో అభివృద్ధికి కొత్త బాటలు వేశారు. ఆయన బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి తొలి ఏడాది కాలంలో, ఈ రోజు వరకూ ఏకంగా రూ.122.85 కోట్ల అభివృద్ధి పనులు చేయించారు. నగర పాలక సంస్థ జనరల్ ఫండ్స్ 31.01 కోట్ల రూపాయలతో నగరంలోని రహదారులు, డ్రైనేజీ కాలవ నిర్మాణం, పార్కుల అబివృద్ధి, వీధి దీపాలు, తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేయించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4.08 కోట్లతో, ఎన్‌సీఏపీ నిధులు రూ.15.51 కోట్లతో అభివృద్ధి పనులు చేశారు. పబ్లిక్ హెల్త్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో అమృత్ స్కీం కింద మరో రూ.15.35 కోట్ల డెవలప్‌మెంట్ వర్కులు జరుగుతున్నాయి. జల్ జీవన్ మిషన్ ద్వారా రూ.14.5 కోట్లతో పనులు చేయించారు. అనంతపురం నగరంలోని పలు ప్రాంతాలు, పంచాయతీల్లో రూ.8.8 కోట్లతో విద్యుత్ లైన్ల మార్పు, కొత్త స్తంభాల ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు తదితర పనులు చేయించారు. నాలుగు పంచాయతీల్లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులు రూ.9 కోట్ల ద్వారా సీసీ రోడ్లు నిర్మాణం చేయించారు. మరో రూ.1.19 కోట్ల పంచాయతీ నిధులతోనూ డెవలప్‌మెంట్ వర్కులు చేయించారు. జిల్లా పరిషత్ ఫండ్స్ రూ.2.05 కోట్లు వినియోగించి.. 4 పంచాయతీల్లో అభివృద్ధి పనులను పరుగులు పెట్టించారు. డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ (డీఎంఎఫ్) నిధులు రూ.0.4 కోట్లతో నాలుగు పంచాయతీల్లో తాగునీటి బోర్లను తవ్వించారు. మోటార్లను ఏర్పాటు చేసి, తాగునీటి సదుపాయాలను కల్పించారు.


ప్రజల విజ్ఞప్తి మేరకు రుద్రంపేటలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయించిన దృశ్యం



నీరు-ప్రగతి పార్కు రహదారి అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే


మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన ముద్దలాపురం వద్ద ఉన్న ఫిల్టరేషన్ ప్లాంట్‌లో పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

విద్య, వైద్యం..రెండు కళ్లు

ప్రజలకు ప్రధానమైనవి విద్య, వైద్యం. ఈ రెండు తప్పనిసరి. మరోరకంగా చెప్పాలంటే ఈ రెండూ.. రెండు కళ్లవంటివి. విద్య, వైద్యం కోసం ఎవరు ఏ చిన్న సాయం కావాలని వచ్చినా దగ్గుపాటి స్పందిస్తారు. ప్రభుత్వం ద్వారా సాయం చేసేందుకు అవకాశం ఉందా అని చూస్తారు..? అవకాశం లేకుంటే ఆయన మరో వైపు చూడరు. తన సొంత ఖర్చులతో సాయం చేసేందుకు వెనుకాడరు. ఇలా అనేక స్కూళ్లు, కళాశాలల్లో అభివృద్ధి పనులు చేయించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు అడిగిందే తడువు అన్నట్లుగా సాయం చేస్తారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో మాట్లాడి, అనంతపురం నగరంలోని ఆరు పాఠశాలలను హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్ చేయించారు. అదేవిధంగా 110 ఏళ్ల చరిత్ర ఉన్న ఆర్ట్స్ కాలేజీలో తరగతి గదులు, హాస్టల్ భవనం సమస్యలు ఆయన దృష్టికి రావడంతో వెంటనే మంత్రి లోకేశ్‌కు వివరించారు. తరగతి గదులకు రూ.1.29 కోట్లు, హాస్టల్ భవనాలకు రూ.2.45 కోట్లు మంజూరు చేయించారు. ఈ రెండు పనులకు భూమి పూజ చేశారు. కేఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో నీటి సమస్య ఉందని కళాశాల సిబ్బంది, విద్యార్థుల ద్వారా తెలుసుకున్నారు. వెంటనే రూ.50 లక్షలతో కాలేజీ, హాస్టల్‌కు పైప్‌లైన్ వేయించి, ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయించారు. సమస్యను పరిష్కరించారు. రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్, శ్రీకృష్ణదేవరాయ హైస్కూల్‌లో విద్యార్థుల సౌకర్యార్థం ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయించారు. ఇతర అభివృద్ధి పనులకు భారీగా సొంత నిధులు కేటాయించారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రోగులకు, వైద్యులకు సదుపాయలు కల్పించారు. అక్కడ అభివృద్ధి పనులకు రూ.7 కోట్లు మంజూరు చేయించారు.


దివ్యాంగురాలి సమస్యను సావధానంగా వింటున్న ఎమ్మెల్యే దగ్గుపాటి



అర్బన్‌లో నిర్వహించిన జాబ్ మేళాలో ఉద్యోగాలు పొందిన నిరుద్యోగులతో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్



గతంలో భారీగా కురిసిన వర్షాలకు కాలనీల్లో పర్యటించి ప్రజల యోగక్షేమాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే



భవిష్యత్తుకు భరోసా

ఏడాది కాలంలో అభివృద్ధి చేయడమే కాకుండా, కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపించారు. భవిష్యత్తుకు భరోసా కల్పించేలా ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అడుగులు వేస్తున్నారు. నడిమివంక, మరువ వంకలకు రక్షణ గోడలు, ఇతర అభివృద్ధి పనుల కోసం రూ.88.05 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. అనంతపురం నగర పాలక సంస్థ పరిధిలో పలు అభివృద్ధి పనులు, కొన్ని పనుల కొనసాగింపు కోసం రూ.25 కోట్లు మంజూరు చేయాలని ప్రతిపానదలు పంపారు. నగరంలో భూగర్భ డ్రైనేజీ కోసం ఇప్పటికే డీపీఆర్ పంపారు. జిల్లాకేంద్రంలోని ప్రజలకు, నగరవాసులకు ఆహ్లాదం పంచే నగరవనాన్ని మరింత అభివృద్ధి చేయడానికి రూ.9.95 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. మార్కెట్ యార్డులో హోల్‌సేట్ ఫ్రూట్స్ మార్కెట్‌లో 93 దుకాణాల నిర్మాణానికి రూ.7.15 కోట్లు మంజూరు చేయాలని ప్రపోజల్స్ పంపారు. జిల్లా మినరల్ ఫౌండేషన్(డీఎంఎఫ్) ద్వారా నాలుగు పంచాయతీల్లో తాగునీటి బోర్ల తవ్వకాల కోసం రూ.3.55 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించేలా చూడాలని, ప్రభుత్వ హాస్టళ్లలో ఆర్వో ప్లాంట్లు మంజూరు చేయాలని, శారదానగర్, రుద్రంపేట ప్రాంతాల్లో శ్మశాన వాటికల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపారు. జూనియర్ కాలేజీల్లో మెస్‌హాళ్లు, అదనపు తరగతి గదులు, స్కూళ్లలో ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు, కంప్యూటర్ ఆపరేటర్ల నియామకం కోసం అనుమతులు, హైస్కూల్ ప్లస్ స్కూళ్లను జూనియర్ కళాశాలలుగా మార్చాలని, మార్కెట్ యార్డులో 100 మెట్రిక్ టన్నుల ఎలక్ట్రిక్ డిజిటల్ వే బ్రిడ్జి మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపారు. ఎనిమిది కాలనీలకు అదనపు అంగన్వాడీ కేంద్రాలు మంజూరు చేయాలని, 13వ వార్డులో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు ఇవ్వాలని ప్రపోజల్స్ పంపారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో బెడ్స్ పెంచాలని, బడ్జెట్ పెంచాలని ప్రతిపాదనలు పంపారు. రోగుల సౌకర్యార్థం ప్రభుత్వాసుపత్రి దగ్గర అన్న క్యాంటీన్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని విన్నవించారు. అర్బన్‌లో మహిళా సంఘాలకు పక్కా భవనాలు మంజూరు చేయాలని, నగరంలోని ముఖ్యమైన, రద్దీ ప్రాంతాల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని, అనంతపురం నగరానికి రెడీ మేడ్ టెక్స్‌టైల్ పార్కు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపారు.





కుటుంబసభ్యులతో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, అన్న క్యాంటీన్‌లో ఓ చిన్నారికి అన్నం తినిపిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి



నీరు-ప్రగతి పార్కు రహదారి అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే



విజయవాడలో వరద బాధితుల సహాయార్థం సీఎం సూచన మేరకు సహాయ సామగ్రిని భారీగా వాహనాల్లో పంపుతున్న ఎమ్మెల్యే



రుద్రంపేటలో కొత్తగా సీసీ రోడ్డు వేయించిన ఎమ్మెల్యే



దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి



ముద్దలాపురం ప్లాంట్‌లో ఫిల్టర్‌బెడ్స్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

'మన ఫ్యామిలీ'గా.. కుటుంబ సభ్యులు సైతం..

ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌తోపాటు ఆయన కుటుంబ సభ్యులు సైతం అర్బన్ ప్రజలను 'మన ఫ్యామిలీ' అన్నట్లుగా సేవలు అందించేందుకు అడుగేస్తున్నారు. ఎన్నికల సమయంలో దగ్గుపాటి సతీమణి శ్రీలక్ష్మి ప్రజలను నేరుగా కలిశారు. వారిని ఆప్యాయంగా పలకరిస్తూ.. ఎన్నికల్లో తమకు అండగా నిలవాలని కోరారు. గెలిస్తే చేయబోనే పనులను వివరించారు. ఎన్నికలు కాగానే, ఇచ్చిన హామీలను నెరవేర్చడంలోనూ చొరవ చూపుతున్నారు. తాను స్వయంగా ఇచ్చిన హామీలను సొంతంగా నెరవేర్చి మనసున్న శ్రీలక్ష్మి అనిపించుకున్నారు. గతంలో 13వ డివిజన్‌లో షాహిన్ అనే మహిళ కుటుంబీకులు రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఒంటరి మహిళ సమస్యను తెలుసుకున్న దగ్గుపాటి శ్రీలక్ష్మి, ఎన్నికలు పూర్తి కాగానే, గెలవగానే పింఛన్ ఇప్పిస్తానని మాట ఇచ్చారు. తన భర్త గెలవగానే పింఛన్‌కు దరఖాస్తు చేయించారు. సాంకేతిక కారణాల వల్ల అది ఆలస్యమైంది. ప్రభుత్వ పరంగా పింఛన్ అందడం ఆలస్యమవుతుందని గ్రహించిన ఎమ్మెల్యే సతీమణి.. బాధితురాలికి ప్రతి నెలా రూ.10,000 తన సొంతం డబ్బును ఇచ్చారు. ఇచ్చిన మాటను అలా సొంతంగా నిలబెట్టుకున్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి కూతురు దగ్గుపాటి అశ్రిత సైతం తల్లిదండ్రులకు తగ్గ తనయగా నిరూపించుకున్నారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన పిలుపు మేరకు పీ-4 సర్వేలో భాగంగా 25 కుటుంబాలను దత్తత తీసుకున్నారు. వారి అభ్యున్నతికి కృషి చేస్తానని ప్రకటించారు.



ఎమ్మెల్యేకు తోడుగా నేను సైతం అంటూ ఆయన సతీమణి శ్రీలక్ష్మి ఇంటింటికీ తిరుగుతూ..



ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌తో కూతురు అశ్రిత..

భూముల పరిరక్షణ.. కొత్త భవనాల కోసం..



అన్యాక్రాంతమైన భూముల పరిరక్షణ కోసం, కొత్త భవనాల మంజూరు కోసం కూడా ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ప్రభుత్వానికి ప్రతిపానదలు పంపారు. అనంతపురం-హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(అహుడా) పరిధిలో 176.97 ఎకరాల భూమి అన్యాక్రాంతమైంది. అక్రమణలు తొలగించి మళ్లీ అనంతపురం నగర పాలక సంస్థలో కలపాలని, ఆ భూమి పరిరక్షించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అదేవిధంగా వైశ్య భవన్ ఏర్పాటుకు 1.5 ఎకరాల భూమి మంజూరు చేయాలని, బీసీ భవన్, యాదవ భవన్ నిర్మాణానికి భూమితోపాటు బడ్జెట్ విడుదల చేయాలని, అహుడా భవన్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపారు.



రూరల్ ఏరియాలో అభివృద్ధి పనుల శిలాఫలం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దగ్గుబాటి

సాయంలో ఆయనకు ఆయనే సాటి.. ఉండదు పోటీ..

నమ్మి వచ్చిన నాయకులు, పార్టీ కార్యకర్తలను తన సొంత కుటుంబ సభ్యులుగా భావించి, అండగా నిలుస్తారు ఎమ్మెల్యే దగ్గుపాటి. వారికి ఏ కష్టమొచ్చినా స్పందిస్తారు. చేయూతనిస్తారు. నియోజకవర్గ ప్రజలనూ అలాగే చూసుకుంటారు. ఇంతేనా..? ఏ ప్రాంతంలో ప్రజలకు కష్టం వచ్చినా మానవీయంగా వ్యవహరిస్తారు. విజయవాడలో వరదలు వచ్చిన సమయంలో ఆయన చేసిన సేవలు అమూల్యం. అక్కడి ప్రజల కష్టాలు, కన్నీళ్లు చూసి ఆయన చలించిపోయారు. పార్టీ శ్రేణులతో కలసి ముందుకు కదిలారు. బాధితుల సహాయార్థం ప్రత్యేక వాహనాల్లో కూరగాయలు, తినుబండారాలు, ఇతర సామగ్రి పంపారు. అదేవిధంగా రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించి, తన మంచి మనసును చాటుకున్నారు. ఆయన నుంచి స్ఫూర్తి పొందిన ఇతర నాయకులు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మరో రూ.10 లక్షలు అందించారు. ఆ మొత్తాన్ని ఎమ్మెల్యే నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేశారు.

పార్టీ శ్రేణులకు..

'నమ్మి వచ్చిన నాయకులు, పార్టీ కార్యకర్తలను ఆయన సొంత మనుషుల్లా చూసుకుంటారు. కష్టాల్లో ఉన్నారని తెలిస్తే దరిచేర్చుకుంటారు..' అని పార్టీ నాయకులు అంటున్నారు. ఇటీవల వివిధ కారణాలతో టీడీపీ కార్యకర్త సాకే వెంకటేష్ ఆత్మహత్యకు యత్నించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ఏమాత్రం ఆలోచించకుండా ఆయనకు అండగా నిలిచారు. తన మనిషిని ఆస్పత్రిలో సాయంగా పెట్టి, రూ.5 లక్షలతో వైద్యం చేయించి ఆదుకున్నారు. కార్యకర్తలు, పార్టీ శ్రేణులు సైతం 'అన్నా..' అని సాయం కోరితే.. 'ఏం కావాలో చెప్పు?' అని అడిగి, సమస్యను పరిష్కరిస్తారు. నమ్మి ఓటేసిన ప్రజలు, నమ్మి తన వెంట నడిచిన శ్రేణులకు ప్రజా ప్రతినిధిగా, నాయకుడిగా, శ్రేయోభిలాషిగా అండగా ఉంటున్నారు. 'నేనున్నాను..' అని అక్కున చేర్చుకుంటున్నారు. అనంతపురం నియోజకవర్గంలో ప్రగతి పసిడి కాంతులు నింపుతున్నారు.



ఓ వృద్ధురాలి వద్దకు వెళ్లి ఆమె సమస్యను ఆలకిస్తున్న దగ్గుపాటి

30 ఏళ్ల డంపింగ్ యార్డు సమస్యకు ఫుల్‌స్టాఫ్

జిల్లా కేంద్రమైన అనంతపురాన్ని దశాబ్దాలుగా పట్టి వేధిస్తున్న సమస్య డంపింగ్ యార్డ్. లక్షల టన్నుల చెత్త పేరుకుపోయి, కొండను తలపించేలా ఉండేది. సమీప ప్రాంతం, చుట్టుపకల ప్రజలకు దుర్వాసన, పొగతో తీవ్ర ఇబ్బంది కలిగించేది. విపరీతమైన వాయు కాలుష్యానికి కారణమయ్యేది. ఏకంగా 30 ఏళ్లుగా ఉన్న ఈ సమస్యను పరిష్కరించేందుకు దగ్గుపాటి నడుం బిగించారు. రూ.12.21 కోట్ల వ్యయంతో డంపింగ్ యార్డులోని 1.68 లక్షల టన్నుల చెత్తను క్లియర్ చేసేందుకు నాంది పలికారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వినతి మేరకు ఇటీవల పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ వచ్చి పనులను ప్రారంభించారు. జాతిపిత మహాత్మా గాంధీ జయంతి అయిన అక్టోబరు 2 నాటికి మొత్తం చెత్తను క్లియర్ చేసేలా శరవేగంగా పనులు సాగుతున్నాయి. నగర ప్రజలు ఎన్నో ఏళ్లుగా పడుతున్న కష్టాలకు చెక్ పడనుంది.





డంపింగ్ యార్డ్‌లో చెత్తను కరిగిస్తున్న యంత్రాలు

వైభవంగా పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ఠ


ప్రతిష్ఠించిన పెద్దమ్మ విగ్రహం

గార్లదిన్నె, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముకుందాపురం లో రూ. 45 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఆలయం లో శనివారం పెద్దమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో వేదపండితులు మూడు రోజులపాటు ఆలయంలో వివిధ పూజలు, హోమాలు చేశారు. ఇక శనివారం తెల్లవారుజామున వేద మంత్రోచ్చారణల నడుమ పెద్దమ్మ విగ్రహాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు పొందారు. గ్రామస్థులు వెంకట్రామిరెడ్డి, పరంధామ, చెన్నారెడ్డి, నాగిరెడ్డి, నరసింహారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, రాముడు, భాస్కర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసుడికి వెండి శఠగోపం సమర్పణ

నార్పల, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలసిన అవధూత తిక్కస్వామి ఆశ్రమ ఆవరణంలోని శ్రీచక్ర శ్రీనివాసుడికి రిటైర్డ్ ఉపాధ్యాయుడు సురేంద్రనాథ్, విజయభారతి దంపతులు వెండి శఠగోపాన్ని శనివారం బహూకరించారు. ఆలయ అర్చకులు మాడుగుల రఘునాథ శర్మ ప్రత్యేక పూజలను నిర్వహించి శఠగోపం స్వీకరించి స్వామివారికి సమర్పించారు. ఆలయ నిర్వహణ సభ్యులు గవ్వల సుబ్బయ్య, ఎంపీటీసీ సభ్యురాలు గవ్వల రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బలరామ జయంతి


బలరామకృష్ణుల ఉత్సవమూర్తులకు అభిషేకం చేస్తున్న దృశ్యం

అనంతపురం టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నగరశివారులోని ఇస్కాన్ మందిరంలో శనివారం బలరామ జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. కృష్ణాష్టమికి వారం రోజుల ముందు బలరామ జయంతిని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో శ్రావణ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని బలరామ కృష్ణుల ఉత్సవమూర్తులను వివిధ రకాల ఫలరసాలతో అభిషేకించారు. రాధాపార్థసారథులకు ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో ఇస్కాన్ మేనేజర్ దామోదర్ గౌరంగదాస్ బలరామకృష్ణుల చరిత్రపై అనుగ్రహభాషణం చేశారు. భక్తులు స్వామివారి భక్తిగీతాలు ఆలపిస్తూ తన్మయత్వం పొందారు. అనంతరం ఇస్కాన్ ఆవరణలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

వన్‌టౌన్ సీఐగా వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ

అనంతపురం క్రైం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): నగరంలోని వన్‌టౌన్ నూతన సీఐగా వెంకటేశ్వర్లు శనివారం బాధ్యతలు స్వీకరించారు. సుమారు రెండు నెలలుగా అక్కడ సీఐ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో కడపలో పని చేస్తున్న వెంకటేశ్వర్లును నియమించారు. బాధ్యతలు తీసుకున్న ఆయనకు స్టేషన్ పరిధిలోని పలువురు పోలీసులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. తర్వాత ఆయన ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర్లను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

పిడుగు పాటుకు విరిగిపడ్డ చెట్టుకొమ్మలు

రామగిరి, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): కుంటిమద్ది సమీపంలో గల చెరువు కట్ట వద్ద చింతమానుపై పిడుగు పడటంతో కొమ్మలు విరిగి రోడ్డుపై పడ్డాయి. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి పిడుగు పడి కొమ్మలు రోడ్డుపై పడ్డాయి. దీంతో గ్రామపెద్దలు శనివారం ఆ కొమ్మలను పక్కకు తొలగించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చేశారు.



ఆర్థిక మంత్రి కేశవ్, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు రాఖీ కట్టి, కానుకలు ఇస్తున్న బ్రహ్మకుమారీలు


సోదరులకు రాఖీ కడుతున్న రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత

ఘనంగా రక్షాబంధన్

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: శ్రావణమాస పౌర్ణమి సందర్భంగా రక్షాబంధన్ వేడుకలను అనంతపురం అర్బన్, శింగనమల, రాప్తాడు నియోజకవర్గాల్లో ప్రజలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. అక్కాచెల్లెళ్లు తమ అన్నదమ్ములకు రాఖీలు కట్టి, మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతపురం నగరంలో ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ప్రతినిధి శారద నేతృత్వంలో బ్రహ్మకుమారిలు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌ను కలిసి రాఖీలు కట్టి మిఠాయిలు పంచారు. దగ్గుపాటి ప్రసాద్‌కు ఆయన సోదరీమణులు, తెలుగుమహిళలు కూడా పెద్దఎత్తున రాఖీలు కట్టారు. అలాగే రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత స్థానిక తన నివాసంలో సోదరులు ధర్మవరపు బాలాజీ, మురళీ, కిరణ్, రాజా తదితరులకు రాఖీలు కట్టారు. తర్వాత ఇతర కార్యాలయ సిబ్బంది, గన్‌మెన్లకు సైతం ఆమె రాఖీలు కట్టారు. అంతకుముందు రామగిరి మండలం వెంకటాపురంలో ఎమ్మెల్యే సునీతకు బ్రహ్మకుమారీలు రాఖీ కట్టారు.

ఆత్మీయ బంధానికి ప్రతీక రక్షాబంధన్: ఎస్పీ

అనంతపురం క్రైం: సోదర, సోదరీమణుల ఆత్మీయ బంధానికి ప్రతీక రక్షాబంధన్ అని ఎస్పీ జగదీష్ ప్రకటనలో పేర్కొన్నారు. భారతీయ సంస్కృతిలో రాఖీ పౌర్ణమికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. అక్కా తమ్ముళ్లు, అన్నా చెల్లెళ్ల అనుబంధానికి చక్కని వేడుక ఈ పండుగన్నారు. జిల్లాలోని సోదర, సోదరీమణులు రక్షాబంధన్‌ను ఘనంగా నిర్వహించాలని ఆయన ఆకాంక్షించారు.

మహిళలకు చీరల పంపిణీ


చీరలు పంపిణీ చేసిన జనసేన నాయకులు

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో జనసేన కార్యాలయంలో రక్షాబంధన్ వేడుకలు శనివారం అట్టహాసంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ నాయకులు మాట్లాడారు. అక్క చెల్లమ్మలకు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ అండగా నిలుస్తున్నారని తెలిపారు. అనంతరం అహుడా చైర్మన్ వరుణ్ తరపున పలువురు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. వరుణ్ సూచనలతో ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో జనసేన నాయకులు రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి జయమ్మ, నాయకులు విజయ్‌కుమార్, నగర కార్యదర్శి లాల్ స్వామి, వీర మహిళ శైలజ కుమారి, పవన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నాగదేవతలకు ప్రత్యేక పూజలు


కలెక్టరేట్ వద్ద పుట్టకు పూజలు చేస్తున్న భక్తులు


హరిహర దేవాలయ ఆవరణలో నాగప్రతిమలకు..

అనంతపురం టౌన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం మూడో శనివారం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా భక్తులు పెద్దసంఖ్యలో పుట్టలు, నాగుల కట్టల వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిప్రపత్తులతో పుట్టలకు, నాగదేవతల ప్రతిమలకు పసుపుదారాలు చుట్టి, పాలు పోసి, ప్రసాదాలు సమర్పించి మొక్కులు మొక్కుకున్నారు. ఈ నేపథ్యంలో నగరంలోని ఆదర్శనగర్ గంగమ్మఆలయం, హరిహర దేవాలయం, కలెక్టరేట్, ఆర్ఎఫ్ రోడ్డు లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయం, చెరువుకట్ట వద్ద గల పుట్టలు, నాగుల కట్టల వద్ద భక్తులతో సందడి వాతావరణం నెలకొంది.

సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయండి

అనంతపురం రూరల్/ రాప్తాడు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున పిలుపునిచ్చారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆత్మకూరు మండల కార్యదర్శి బండారు శివ అధ్యక్షతన రాప్తాడు నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఇందులో మల్లికార్జున మాట్లాడుతూ..అనంతపురం నగరంలో 12,13వ తేదీల్లో జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు రామకృష్ణ, రాప్తాడు నియోజవకర్గ కార్యదర్శి రమేష్, రూరల్ మండల కార్యదర్శి నరేష్, సహాయకార్యదర్శి దుర్గాప్రసాద్, రాప్తాడు మండల కార్యదర్శి రవీంద్ర, సహాయ కార్యదర్శి చలపతి, రాప్తాడు నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు, శాఖ కార్యదర్శులు పాల్గొన్నారు. అలాగే రాప్తాడు మండలకేంద్రంలో సీపీఐ మండల కార్యదర్శి రవీంద్ర విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఈ మేరకు పిలుపునిచ్చారు.

సొసైటీ చైర్మన్‌కు సన్మానం

అనంతపురం రూరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచానపల్లి సింగిల్ విండో అధ్యక్షుడు పాములాయి రఘును ఇటుకపల్లి, ఆకుతోటపల్లి, కందుకూరు, ఉప్పరపల్లి, కొడిమి, పాపంపేట, నరసనాయనికుంట, తాటిచెర్ల గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు సన్మానించారు. గ్రామంలోని ఆయన నివాసంలో శనివారం వారు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించారు.

విద్యుత్ కార్మికుడికి రైతుల చేయూత

రామగిరి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలేపల్లి విద్యుత్ కార్మికుడు నాగేంద్ర ఇటీవల ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతుండగా.. ఆ గ్రామానికి చెందిన రైతులు తమవంతుగా ఆర్థిక సహకారం అందించారు. బెంగుళూరులో చికిత్స పొందుతున్న నాగేంద్రను శనివారం పోలేపల్లి రైతులు వెళ్లి పరామర్శించారు. అనంతరం రూ.1.10లక్షల ఆర్థికసాయం అందించారు.

సవరణ

తేదీ. 09.08.2025వ తేదీన ప్రచురించిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నార్పల శాఖ వారి భవనము అద్దెకు కావలెను ప్రకటన యందు 4000 చ॥అ॥ల భవనమునకుకు బదులుగా 1400 ± 10% చ॥అ॥లు భవనముగా చదువుకొనగలరు.

వైసీపీ పాపాలు..!



అహుడా కార్యాలయం

(5వ పేజీ తరువాయి)

40వేల మందికిపైగా లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరనుందని అహుడా వర్గాలు చెబుతున్నాయి.

ప్రభుత్వ ఆదాయానికి గండి

అనుమతులు తీసుకోకుండా వేసిన లేఅవుట్లతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతున్నారు. డెవలప్‌మెంట్ చార్జీలు, ఫీజులు చెల్లించకుండా అక్రమంగా లేఅవుట్లు వేసేశారు. కొందరు అధికారులు.. వైసీపీ నేతలతో కుమ్మక్కై యథేచ్ఛగా అక్రమ లేఅవుట్లకు సహకరిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. అహుడాలో పనిచేసే ఓ ఇంజనీరు.. వైసీపీ నాయకులతో బహిరంగంగానే చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నారనే చర్చ సాగుతోంది. గతంలో ఆ ఇంజనీరు అనంత నగరపాలక సంస్థ పబ్లిక్ హెల్త్ విభాగంలో పనిచేసిన సమయంలోనే భారీగా అక్రమార్జనకు మరిగారనే పేరు మూటగట్టుకున్నారు. తననెవరూ ఏమీ చేసుకోలేరనే ధీమాతోనే అక్రమాలకు ఆజ్యం పోస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చినా వైసీపీ నేతల కనుసన్నల్లోనే ఆ ఇంజనీరు పనిచేస్తుండడం గమనార్హం.

నగర శివారులోనే అధికం

అనంతపురం నగర శివారులోనే అత్యధికంగా అనధికార లేఅవుట్లు వెలిశాయి. గోవిందంపల్లిలో సర్వే నంబర్లు 78, 145, 165, వడియంపేట గ్రామ పంచాయతీ పొడరాళ్ల పరిధి సర్వే నంబర్ల 295, 279, 84, 85, 87లో అనధికారికంగా వేసిన లేఅవుట్లలో రాళ్లను ఇటీవల అహుడా అధికారులు తొలగించారు. నారాయణపురం పంచాయతీలోని సర్వే నంబరు 104, 202లో (10.8 ఎకరాలు), సర్వే నంబరు 142,145లలో (2.8 ఎకరాలు). నరసనాయుని కుంట పంచాయతీలో సర్వే నంబరు 111, 117లలో (6.5 ఎకరాలు), సర్వే నంబరు 113లో ఎకరం, సర్వే నంబరు 121లో (6.4 ఎకరాలు), సర్వే నంబరు 124, 126లలో (4.6ఎకరాలు), కక్కలపల్లి పంచాయతీలో సర్వే నంబరు 191లో (8ఎకరాలు), సర్వే నంబరు 183లో (2.1ఎకరాలు), సోములదొడ్డి పంచాయతీలో సర్వే నంబరు 62లో (11.5) ఎకరాల్లో వేసిన అనధికార లేఅవుట్లలోని రాళ్లను ఆయా పంచాయతీ కార్యదర్శులతో కలిసి అహుడా ప్లానింగ్ అధికారులు తొలగించారు.

అన్నింటినీ క్రమబద్ధీకరించుకోవాల్సిందే

- టీసీ వరుణ్, అహుడా చైర్మన్



అహుడా పరిధిలోని అనధికార లేఅవుట్లు అన్నింటినీ క్రమబద్ధీకరించుకోవాల్సిందే. లేదంటే బ్లాక్‌లిస్టులో పెట్టేస్తాం. అహుడా పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఉన్న అనధికారి లేఅవుట్ల వివరాలను సేకరించి, ఎల్ఆర్ఎస్ వర్తింపజేసేలా ప్రణాళికలు రూపొందించాం.

వేతనం ఎప్పుడో..?

పది మూల్యాంకనం ముగిసి నాలుగు నెలలు
నేటికీ అందని వేతనం... పట్టించుకోని విద్యాశాఖ



మూల్యాంకనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ కిష్టప్ప (ఫైల్)

ధర్మవరం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పది పరీక్షల మూల్యాంకన వేతనాలు విద్యాశాఖ ఎప్పుడు ఇస్తుందోనని ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారు. మూల్యాంకనం ముగిసి నాలుగు నెలలైనా ఇంతవరకు చెల్లింపుల్లేవు. దూరప్రాంతాల నుంచి సొంత ఖర్చులు పెట్టుకుని వచ్చిన ఉపాధ్యాయులు మూల్యాంకన వేతనాల కోసం పడిగాపులు కాస్తున్నారు. ఒక్కో ఉపాధ్యాయుడికి సగటున 6 వేల వరకు, సహాయకులకు 3 వేలు చొప్పున చెల్లించాల్సి ఉంది. శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా 1,500 మంది టీచర్లకు రూ.72.8 లక్షలు, 200 మంది సహాయకులకు రూ.13.09 లక్షలు మూల్యాంకన నిధులు విడుదల కావాల్సి ఉందని విద్యాశాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది. వేతన చెల్లింపుల కోసం ఉన్నత, జిల్లాస్థాయిలో అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు.


ఫీజు రూపంలో వసూలు చేసినా..

మూల్యాంకన చెల్లింపులకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు విడుదల చేయాల్సిన అవసరం లేదు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఫీజులు చెల్లిస్తారు. ఇలా వసూలు చేసిన సొమ్మును ప్రశ్నాపత్రాల ముద్రణ, కేంద్రాల నిర్వహణ, ప్రశ్నాపత్రాల రవాణా, ఇన్విజిలేటర్ల భత్యం, మూల్యాంకన వేతన చెల్లింపుల కోసం వినియోగించాలి. కావున, పరీక్షల ప్రక్రియకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు ఇవ్వాల్సిన అవసరం లేదు. విద్యార్థుల నుంచి పరీక్షల ఫీజు వసూలు చేస్తున్నారు. విద్యార్థులు జాప్యం చేస్తే జరిమానాలు వేస్తున్నారు. ప్రభుత్వం చెల్లింపుల్లో జాప్యం ఎందుకు చేస్తుందో అర్థం కావడంలేదని ఉపాధ్యాయ సంఘాల నాయకులు మండిపడుతున్నారు.

ఏటా ఇదే తంతు

పదో తరగతి మూల్యాంకన చెల్లింపుల విషయంలో జాప్యం జరుగుతోందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. గతేడాది పది సప్లిమెంటరీ పరీక్షల మూల్యాంకన వేతనం నేటికీ పూర్తిస్థాయిలో చెల్లించలేదని ఉపాధ్యాయులు వాపోతున్నారు. దాదాపు పది రోజులపాటు ఉపాధ్యాయులు మూల్యాంకన విధుల్లో పాల్గొన్నారు. ఇతరప్రాంతాల నంచి వచ్చిన వారికి డీఏ కూడా చెల్లించాలి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మూల్యాంకన నిధులు విడుదల చేయాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

వెంటనే చెల్లించాలి



మూల్యాంకన వేతనాలు అధికారులు వెంటనే చెల్లించాలి. జిల్లాలో చాలామంది టీచర్లు సొంత ఖర్చులు పెట్టుకుని మూల్యాంకనానికి హాజరయ్యారు. మామూలుగా మూల్యాంకనం జరిగిన వెంటనే ఇవ్వాలి. అసలు మూల్యాంకనం రుసుం ప్రభుత్వం నుంచి విడుదలైంది. జిల్లా విద్యాశాఖ అధికారులే ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇలాగైతే భవిష్యత్తులో మూల్యాంకన విధులు అంటనే ఉపాధ్యాయులు వెనకడుగు వేస్తారని ఉపాధ్యాయ వర్గాలు వాపోతున్నాయి.

-సాని రవీంద్రారెడ్డి, ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు

త్వరగా ఇవ్వాలి

-సుధాకర్, జిల్లా ప్రధానకార్యదర్శి, యూటీఎఫ్



ప్రభుత్వం మూల్యాంకన వేతనాన్ని త్వరగా చెల్లించాలి. మూల్యాంకనం పూర్తయి నాలుగు నెలలు గడుస్తున్నా నేటికీ వేతనం చెల్లించకపోవడంలో ఆంతర్యమేమిటి? విద్యాశాఖ అధికారులు కూడా ఉపాధ్యాయులతో పని చేయించుకుని వారికి వేతనం ఇవ్వడంలో అలసత్వం వహిస్తున్నారు.

మూడు రోజుల్లో జమవుతుంది

-కిష్టప్ప, డీఈఓ

పదో తరగతి మూల్యాంకనం చేసిన టీచర్లకు వేతనం మూడు రోజుల్లో వారి ఖాతాల్లోకి జమవుతుంది. బడ్జెట్ వచ్చింది. వేతనాల బిల్లులు ట్రెజరీకి పంపాం. మూడు రోజుల్లో వేతనం జమవుతుంది.



కసాపురంలో స్వామికి అలంకరణ



నేమకల్లులో..



మురడిలో...



నేమకల్లులో స్వామివారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

జై హనుమాన్

అంజన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు
కసాపురం, మురడి, నేమకల్లు ఆలయాలు కిటకిట

గుంతకల్లు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): శ్రావణ పౌర్ణమి, శనివారం కావడంతో జిల్లాలోని ప్రసిద్ధి చెందిన ఆంజనేయ స్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. కసాపురంలోని శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామివార్లకు గజ వాహనోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి మూల విరాట్టుకు వేకువనే అభిషేకాలు చేశారు. వజ్రఖచిత స్వర్ణాభరణ అలంకారాలు చేశారు. సెలవు దినం కూడా కావడంతో ఉదయం నుంచీ రాత్రి 9 గంటల వరకూ ఇసుకేస్తే రాలనంత మంది భక్తులు స్వామివారి దర్శనార్థం తరలివచ్చారు. దీంతో పట్టణంలో పలుమార్లు ట్రాఫిక్ జామ్ అయింది. క్యూలైన్లను నియంత్రించడానికి పోలీసులు, ఆలయ అధికారులు, సిబ్బంది, వలంటీర్లు ఆపసోపాలు పడాల్సి వచ్చింది. ఆలయంలో సుందరకాండ పారాయణం, హనుమాన్ చాలీసా పఠనం, మధ్యాహ్నం మహా మంగళహారతి ఇచ్చారు. సాయంత్రం గజ వాహనంపై శ్రీ సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయ స్వాముల ఉత్సవ విగ్రహాలను సర్వాంగ సుందరంగా అలంకరించి, ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు.

నేమకల్లు కిటకిట..

బొమ్మనహాళ్(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు శ్రీ ఆంజనేయస్వామి దర్శనానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. దీంతో ఆలయం భక్తజనసంద్రంగా మారింది. సర్వదర్శనానికి 2 గంటలుపైగా పట్టింది. కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి రూరల్ మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్ రెడ్డి, కంప్లి మాజీ ఎమ్మెల్యే సురేష్ బాబు.. స్వామివారిని దర్శించుకున్నారు.

మార్మోగిన అంజన్న నామం

డీ హీరేహాళ్(ఆంధ్రజ్యోతి): మండలంలోని మురడి గ్రామం అంజన్న నామస్మరణతో మార్మోగింది. గ్రామంలో వెలసిన శ్రీ ఆంజనేయస్వామి దర్శనానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకాలు చేసి, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కర్ణాటకలోని కురుగోడు మాజీ ఎమ్మెల్యే నారా సూర్యనారాయణ రెడ్డి పూజలు నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు. కసాపురం, మురడి, నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయాలను ఉప లోకాయుక్త రజని సందర్శించారు.

భక్తిశ్రద్ధలతో ఏడు శనివారాల వ్రతం



ఆర్ఎఫ్ రోడ్డు లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో పెళ్లి పీటలపై స్వామి, అమ్మవార్లు

అనంతపురం టౌన్, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): ఏడుశనివారాల వ్రతాల్లో భాగంగా నగరంలోని పలు ఆలయాల్లో వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆర్ఎఫ్ రోడ్డు, రామ్‌నగర్‌లోని వెంకటేశ్వర స్వామి, అశోక్‌నగర్‌లోని సత్యనారాయణస్వామి ఆలయాలతో పాటు శారదానగర్‌లోని శృంగేరి శంకరమఠంలో వేదపండితులు వేద మంత్రోచ్చారణల నడుమ శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామిల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పూజాది కైంకర్యాలు నిర్వహించారు. పండితులు వ్రతవిశిష్టతను వివరిస్తుండగా భక్తులు సామూహికంగా వ్రతాలను ఆచరించారు.

పుస్తకావిష్కరణ సభకు తరలిరండి

అనంతపురం టౌన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): జిల్లా రచయితల సంఘం(జిరసం) ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో పుస్తకావిష్కరణ సభ జరగనుందని, విజయవంతం చేయాలని జిరసం అధ్యక్షుడు కొత్తపల్లి సురేష్ శనివారం ప్రకటనలో పిలుపునిచ్చారు. అందులో సీనియర్ కవి గుడిపాటి సూర్యం రచించిన 'జీవన శిల్పి' కవితా సంపుటిని ఆవిష్కరించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని సాహితీకారులు, సాహిత్యాభిమానులు విరివిగా పాల్గొనాలని కోరారు.

పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం విద్య, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందిస్తున్నామనీ, ఉమ్మడి జిల్లాలోని టీచర్లు దరఖాస్తు చేసుకోవచ్చని ఆత్మీయట్రస్టు చైర్మన్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జయచంద్రారెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. మెరుగైన బోధన, విద్యార్థుల అభ్యున్నతికి కృషి, క్రమశిక్షణ కలిగిన టీచర్లు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత గల టీచర్లు ఈనెల 20వ తేదీలోగా దరఖాస్తులు అందజేయాల్సి ఉంటుందని జయచంద్రారెడ్డి కోరారు. వివరాలకు 9030944717 నంబరులో సంప్రదించాలన్నారు.

బీఏఎస్‌ను పునరుద్ధరించాలి

- ఎమ్మార్పీఎస్

అనంతపురం వైద్యం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను చదివించేలా బెస్ట్ అవలబుల్ స్కూల్ (బీఏఎస్) పథకాన్ని పునరుద్ధరించాలని ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధికార ప్రతినిధి అక్కులప్ప రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. నగరంలోని సంఘం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019కి ముందు సీఎంగా ఉన్న చంద్రబాబు బీఏఎస్‌ను తీసుకొచ్చారన్నారు. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి ఆ పథకాన్ని తొలగించారన్నారు. దీంతో వందలాది మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు గత ఐదేళ్లలో కార్పొరేట్ పాఠశాలలకు దూరమయ్యారని వాపోయారు. తిరిగి చంద్రబాబు అధికారంలోకి రావడంతో బీఏఎస్‌పై వారి తల్లిదండ్రుల్లో ఆశలు పెరిగాయన్నారు. ఏడాది గడిచినా బీఏఎస్‌పై ప్రభుత్వం మాట్లాడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి బీఏఎస్‌ను పథకాన్ని పునరుద్ధరించాలని కోరారు. నాయకులు అంజినప్ప, ఉదయ్‌కుమార్, రామాంజనేయులు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల వృక్షా బంధన్



చెట్టుకు రాఖీ కడుతున్న విద్యార్థులు

కుందుర్పి, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): సమాజక్రాంతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మండలవ్యాప్తంగా నిర్వహిస్తున్న విలువల బడుల్లో వృక్షా బంధన్ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. రక్షాబంధన్ రోజున విద్యార్థులందరూ తాము నాటిన చెట్లకు రాఖీలు కడుతూ పర్యావరణ పరిరక్షణ, చెట్ల సంరక్షణకు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో విలువల బడుల ఉపాధ్యాయులు నాగరాజు, దిలీప్, అనిత, మల్లికార్జున, ఆశాలక్ష్మి, శ్రీలత, రఘువరన్, హనుమంతరాయుడు, కోఆర్డినేటర్ శ్రీకాంత్ విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు. రక్షాబంధన్ రోజున మానవ సంబంధాలను, విలువలను తెలియజేయడంతోపాటు పర్యావరణ పరిరక్షణ కోసం ఈ స్ఫూర్తిదాయక కార్యక్రమాన్ని నిర్వహించిన విద్యార్థులు, ఉపాధ్యాయులను సమాజ క్రాంతి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు ఎస్కే లెనిన్ బాబు అభినందించారు.

దేవుడిచ్చిన అన్నయ్యకు రాఖీ

ఎంఎస్ రాజుకు రాఖీ కట్టిన పల్లె సింధూర



ఎంఎస్ రాజుకు రాఖీ కడుతున్న సింధూరారెడ్డి

అనంతపురం క్రైం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజుకు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి రాఖీ కట్టారు. నగరంలోని ఎంఎస్ రాజు నివాసానికి శనివారం సింధూరా రెడ్డి వెళ్లి ఆయనకు రాఖీ కట్టారు. అనంతరం ఆ మెకు రాజు దంపతులు చీర, సారె పెట్టి గౌరవించారు. దేవుడిచ్చిన అన్నయ్యకు రాఖీ కట్టడం ఎంతో ఆనందంగా ఉందని పల్లె సింధూర పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

అనంతపురం క్రైం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి చెందిన ఆరుగురికి రూ. 6.47లక్షల మేర సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. వాటికి సంబంధించిన చెక్కులను నగరంలోని తన కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఈ 14 నెలల్లోనే సుమారు రూ 1.75 కోట్ల మేర సీఎం రిలీఫ్ ఫండ్ అందించినట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇలాంటి సాయం ఎవరికీ అందలేదన్నారు. జగన్ పాలనంతా ప్రజావ్యతిరేకంగానే సాగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు బుగ్గయ్యచౌదరి, కోనంకి గంగారామ్, అహ్మద్, కడియాల కొండన్న, చేపల హరి, గోపాల్ గౌడ్, నెట్టెం బాలకృష్ణ, సుధాకర్ యాదవ్, లక్ష్మి నరసింహ, దుర్గేష్ పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

సున్నం వేశాడు..!

సున్నా డౌన్ పేమెంట్, సున్నా వడ్డీతో కార్లు ఇప్పిస్తానంటూ మోసం
డ్రైవర్లకు రూ.3 లక్షలకు కుచ్చుటోపీ
పోలీసులను ఆశ్రయించిన బాధితులు

గార్లదిన్నె, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): జీరో డౌన్ పేమెంట్... జీరో ఇంట్రెస్ట్‌తో కొత్త కార్లు ఇప్పిస్తానని నమ్మబలికి డ్రైవర్లకు కుచ్చుటోపీ పెట్టాడు ఓ మోసగాడు. జాతీయ రహదారి పనులు చేసే సంస్థలో అద్దెకు పెట్టిస్తానంటూ డబ్బు వసూలు చేసి, ఉడాయించాడు. గార్లదిన్నెలో విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గార్లదిన్నె, శింగనమల మండలాలకు చెందిన రమేష్, దేవరాజు, నాగరాజు, వెంకటేష్, తిమ్మయ్య కారు డ్రైవింగ్ చేసుకుంటూ కుటుంబాలను పోషించుకునేవారు. వారికి గార్లదిన్నెలో ఓ మహిళతో పరిచయం ఏర్పడింది. ఆమె ఎన్‌హెచ్ఏఐలో జనరల్ మేనేజర్‌గా ఉద్యోగం చేస్తున్నానని చెప్పింది. సాయి అనే వ్యక్తి తనతోపాటు ఉద్యోగం చేస్తున్నాడని అతడిని డ్రైవర్లకు పరిచయం చేసింది. తనది రాజమండ్రి అనీ, తాను ఎన్‌హెచ్ఏఐలో ఉద్యోగం చేస్తున్నానని అతడు చెప్పాడు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో ఎన్‌హెచ్ పనులు చేపడుతున్నారనీ, అందులో చాలామంది ఉద్యోగులున్నారన్నారు. కార్యాలయం మాత్రం అనంతపురంలో ఉందన్నాడు. ఉద్యోగులు రోజూ అనంతపురం నుంచి ధర్మవరానికి రాకపోకలు సాగిస్తున్నారని నమ్మబలికారు. అందుకు కార్లు అద్దెకు కావాలని తెలిపారు. ఎన్‌హెచ్ పనులు ఐదేళ్లు ఉంటాయనీ, జీరో డౌన్‌పేమెంట్‌తో కార్లు ఇప్పిస్తానని డ్రైవర్లకు ఆశ చూపాడు. డీజిల్ అంతా కంపెనీనే భరిస్తూ కారుకు నెలకు రూ.40వేలు, డ్రైవర్‌కు రూ.17వేలు మొత్తం రూ.57వేలు ఇప్పిస్తానన్నాడు. కార్లకు బాడుగలు లేక కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిన తరుణంలో డౌన్ పేమెంట్, వడ్డీ లేకుండా కొత్తకార్లు వస్తాయని చెప్పడంతో డ్రైవర్లు నమ్మారు. 5 సంవత్సరాలు అగ్రిమెంట్ చేయాల్సి ఉంటుందని సాయి నమ్మబలికాడు. అందుకు డ్రైవర్లు ఓకే చెప్పారు. అగ్రిమెంట్‌కు ఒక్కొక్కరు రూ. 10వేలు... కారు బుకింగ్ కోసం రూ.50వేలు ఇవ్వాల్సి ఉంటుందన్నాడు. ఇందుకు డ్రైవర్లు ఒక్కక్కరు రూ.10వేలు ఫోన్ పే చేసి, రూ. 50వేలు నగదు రూపంలో సాయికి అందజేశారు. ఇలా ఐదుగురు మొత్తం రూ.3 లక్షలు ముట్టజెప్పారు. మూడు నెలలు కావస్తున్నా కొత్తకార్లు రాలేదు. డ్రైవర్లకు అనుమానం వచ్చి సాయికి ఫోన్ చేశారు. అదిగో...ఇదిగో.. అంటూ కాలయాపన చేయసాగాడు. 'నాతో డబ్బుల్లేవు. ఏం చేసుకుంటారో చేసుకోండి' అని బెదిరించాడు. దీంతో సాయిని పరిచయం చేసిన మహిళను డ్రైవర్లు నిలదీశారు. తనకు సంబంధం లేదని మహిళ చెప్పింది. ఆమెతో కారు డ్రైవర్లు వాదనకు దిగారు. తాను కూడా కార్ల కోసం డబ్బు కట్టి, మోసపోయనని మహిళ వాపోయింది. దీంతో కారు డ్రైవర్లు, మహిళ.. పోలీసులను ఆశ్రయించారు. సాయి అనే వ్యక్తి తమకు కార్ల ఆశ చూపి మోసం చేశాడనీ, న్యాయం చేయాలని కోరారు. విచారణ చేసి న్యాయం చేస్తామని గార్లదిన్నె పోలీసులు తెలిపారు.

దండించాడని... దాడి

బాధితుడి మృతి.. 24 గంటల్లో నిందితుడి అరెస్టు



నిందితుడితో త్రీటౌన్ పోలీసులు

అనంతపురం క్రైం, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): చిన్నా, పెద్దా లేదా అంటూ గుర్తు తెలియని వ్యక్తి దండించాడన్న కోపంతో పిడిగుద్దలు గుద్దడంతో అతడు స్పృహతప్పి పడి మరణించాడు. దాడి చేసి పారిపోయిన నిందితుడిని త్రీటౌన్ పోలీసులు 24 గంటల్లో పట్టుకున్నారు. శనివారం త్రీటౌన్ సీఐ శాంతిలాల్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం 6.30 గంటలప్పుడు శ్రీనివాసనగర్‌లోని అన్న క్యాంటీన్ వద్ద ఘర్షణ జరిగింది. శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం మంగళమడక గ్రామానికి చెందిన చిన్న వెంకటరాముడు(50) స్వీపర్‌గా పనిచేస్తుండేవాడు. శ్రీనివాసనగర్‌లోని రాముని గుడి వద్ద నివాసం ఉండేవాడు. ఆయన అన్న క్యాంటీన్ వద్ద ఉండగా, వినాయకనగర్‌కు చెందిన బర్గోళ్ల రామంజి అలియాస్ రామాంజనేయులు(33) అక్కడికి వచ్చాడు. నిలబడిన ఉన్న చిన్న వెంకటరాముడిని మాట్లాడిస్తూ... 'మావాళ్లు ఏమైనా ఇక్కడ వచ్చినారా ఓయ్...!' అన్నాడు. దీంతో వయసురీత్యా పెద్ద అయిన చిన్న వెంకటరాముడు 'నువ్వు ఎవరు నన్ను అడుగుతావు... చిన్న, పెద్ద తేడా లేదా..?' అంటూ దండించాడు. దీంతో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగింది. కోపం మీద ఉన్న రామాంజనేయులు ఒక్కసారిగా వెంకటరాముడు మొహం, ఛాతీపై మూడు, నాలుగుసార్లు పిడిగుద్దులు గుద్దాడు. దీంతో చిన్న వెంకటరాముడు స్పృహతప్పి పడి, మరణించాడు. విచారణ చేపట్టిన పోలీసులు సీసీ టీవీ ఫుటేజీ ఆధారంతో నిందితుడిని రైల్వేస్టేషన్ వద్ద పట్టుకున్నారు. అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపారు.

విస్తారంగా వర్షాలు

అనంతపురం అర్బన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని మండలాల్లో శుక్రవారం వర్షం కురిసింది. అత్యధికంగా వజ్రకరూరులో 86.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఆత్మకూరు 70.4, శెట్టూరు 68.4, బెళుగుప్ప 65.4, విడపనకల్లు, తాడిపత్రి 61.4, గుమ్మఘట్ట, బ్రహ్మసముద్రం 58.2, పెద్దవడుగూరు 52.4, యల్లనూరు 49.8, యాడికి 48.4, గార్లదిన్నె 46.4, కంబదూరు 45.4, ఉరవకొండ 45.2, రాయదుర్గం 43.2, కుందుర్పి 39.6, కళ్యాణదుర్గం 39.0, అనంతపురం 32.4, గుంతకల్లు 30.2, శింగనమల 28.4, పామిడి 25.2, కణేకల్లు, రాప్తాడు 21.0, డి.హిరేహాళ్, బుక్కరాయసముద్రం 20.2, పుట్లూరు 19.4, కూడేరు 18.4, నార్పల 16.6, పెద్దపప్పూరు 9.6, బొమ్మనహాళ్ 4.0 మి.మీ. వర్షపాతం నమోదైంది.



భక్తిశ్రద్ధలతో సత్యదేవుని వ్రతాలు

● కిక్కిరిసిన ఆలయాలు





అనంతపురం టౌన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం జిల్లావ్యాప్తంగా వాడవాడలా సత్యదేవుని వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాలు కిక్కిరిశాయి. అనంతపురంలోని అశోక్‌నగర్‌లోని సత్యదేవుని ఆలయంతోపాటు షిర్డీసాయిబాబా మందిరాల్లో సత్యనారాయణస్వామికి ప్రత్యేక అలంకరణలు చేశారు. వేదపండితులు వ్రత విశిష్ఠతను వివరిస్తుండగా భక్తులు సామూహికంగా వ్రతాలను ఆచరించారు. హరిహర దేవాలయంలో శ్రావణ పౌర్ణమి సందర్భంగా హయగ్రీవస్వామికి భక్తుల చేతులమీదుగా పంచామృతాభిషేకాలు చేయడంతోపాటు ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

అశోక్‌నగర్ సత్యదేవుని మందిరంలో దర్శనమిస్తున్న రమాసమేత సత్యనారాయణ స్వామి, సామూహికంగా సత్యదేవుని వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు



జలపాతం కోనవిందు..!

యాడికి మండలంలోని కోన రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద జలపాతం కనువిందు చేస్తోంది. నంద్యాల జిల్లా సరిహద్దుల్లో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురవడంతో వర్షపునీరు కోన రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న కొండలపై నుంచి దూకుతోంది. ఏటా వర్షాకాలంలో జీవం పోసుకునే ఈ జలపాతం.. ఈ ఏడాది కాస్త ఆలస్యంగా జలకళను సంతరించుకుంది. మరో మూడు నెలలపాటు నీరు పారే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. యాడికి మండల కేంద్రం నుంచి 15 కి.మీ. దూరంలో ఉన్న ఈ జలపాతం వద్దకు వెళ్లడానికి రోడ్డు సౌకర్యం బాగుంది. వాహనాలు సొంతంగా తీసుకువెళ్లాల్సిందే. జలపాతాన్ని చూసేందుకు ఉమ్మడి అనంత, కర్నూలు, కడప జిల్లాల నుంచి పర్యాటకులు తరలివస్తారు.

-ఆంధ్రజ్యోతి, యాడికి

చూడండి సర్.. మీరిచ్చిన నీరు..!



రాగులపాడు వద్ద నీటి పంపింగ్‌ను పరిశీలిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్(ఫైల్)

వజ్రకరూరు మండలంలోని రాగులపాడు వద్ద హంద్రీనీవా ఎత్తిపోతల పథకం నుంచి 10 మోటార్లతో నీటిని పంపింగ్ చేసే వీడియోను సీఎం చంద్రబాబుకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పంపించారు. ఈ వీడియోను చూసి సీఎం సంతోషం వ్యక్తం చేసినట్లు మంత్రి శనివారం తెలిపారు. హంద్రీనీవా కాలువను వెడల్పు చేసి, 10 మోటార్లతో నీటి పంపింగ్ చేసేలా చర్యలు తీసుకున్న సీఎం చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. హంద్రీనీవా కాలువలో పుష్కలంగా నీరు వస్తోందని, ఇందుకు ఆనందంగా ఉందని మంత్రి తెలిపారు. అనంతపురం జిల్లాకు ఇంత పెద్ద ఎత్తున నీటిని తీసుకురావడం సంతోషంగా ఉందని సీఎం తనకు రిప్లై ఇచ్చారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే ఆరు మోటార్ల నుంచి 12 మోటార్లను వాడుకునేలా కాలువ సామర్థ్యాన్ని రెండింతలు పెంచామని అన్నారు. ప్రస్తుతం కాలువలో రెండింతల సామర్థ్యంతో నీరు ప్రవహిస్తోందని అన్నారు. - ఆంధ్రజ్యోతి, ఉరవకొండ

వైసీపీ పాపాలు..!

అహుడా పరిధిలో కుప్పలు తెప్పలుగా అనధికార లే అవుట్లు

● 700కిపైగా అనుమతులు లేనివే..
● అధిక భాగం వైసీపీ హయాంలో వేసినవే..
● క్రమబద్ధీకరణకు ససేమిరా
● ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి



అనధికార లేఅవుట్‌లో రాళ్లను తొలగిస్తున్న అహుడా అధికారులు (ఫైల్)

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో భూఅక్రమాలకు అంతేలేదన్నది బహిరంగ రహస్యమే. భూకబ్జాలతో పేట్రేగిపోయారు. ఆ పార్టీకి చెందిన నేతలు.. రియల్టర్ల అవతారమెత్తి నిబంధనలకు తిలోదకాలిచ్చారు. యథేచ్ఛగా అక్రమ లేఅవుట్లు వేసి, అడ్డంగా దోచుకున్నారు. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొట్టారు. కూటమి ప్రభుత్వం లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం (ఎల్‌ఆర్‌ఎస్)ను అమలులోకి తేవడంతో అక్రమాలు బయటపడుతున్నాయి. 2019-24 మధ్య వైసీపీ పాలనలో అనంతపురం హిందూపురం పట్టణాభివృద్ధి సంస్థ (అహుడా) పరిధిలో 700కిపైగా లేఅవుట్లు 8వేల ఎకరాల్లో విస్తరించినట్లు సమాచారం. వీటిలో 80శాతానికిపైగా వైసీపీ నేతలకు చెందినవే కావడం గమనార్హం. గత వైసీపీ ప్రభుత్వంలోనే విజిలెన్స్ అధికారులు.. అనధికార లేఅవుట్లపై నివేదిక ఇచ్చినా బుట్టదాఖలు చేశారు. దీంతో కూటమి ప్రభుత్వం అనధికార లేఅవుట్లను కట్టడి చేసి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న వెంచర్లను క్రమబద్ధీకరించే పనిలో పడింది. ఈ ప్రక్రియలో అసలు విషయం బయటకు వస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో అహుడాలోనే పనిచేస్తున్న ఓ ఇంజనీరు.. వైసీపీ నేతలతో అంటకాగినట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం వచ్చినా ఆ ఇంజనీరును అహుడాలోనే కొనసాగిస్తుండడం గమనార్హం. ఎల్‌ఆర్‌ఎస్‌ను పూర్తి స్థాయిలో తీసుకుంటే ఉమ్మడి జిల్లాలో 700కిపైగా ఉన్న అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొన్న (మిగతా 6వ పేజీలో..)

రేపు కలెక్టరేట్‌లో పరిష్కార వేదిక

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికను ఈనెల 11న కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ శనివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు ఇవ్వవచ్చని సూచించారు.

కలుషితం లేనోళ్లు గిరిజనులు

● పిల్లలను బాగా చదివించుకోవాలి
● డీఆర్వో మలోల సూచన ● ఘనంగా అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం



మన్యం వీరుడిగా డీఆర్వో మలోల

అనంతపురం విద్య, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కలుషితం లేనోళ్లు గిరిజనులని డీఆర్వో మలోల కొనియాడారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నగరంలోని గిరిజన భవనంలో వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. తొలుత అంబేడ్కర్, అల్లూరి సీతారామరాజు, ఏకలవ్య, బిర్సాముండా చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీఓ మాట్లాడుతూ.. గిరిజనులు కష్టజీవులన్నారు. ఆర్థిక అభివృద్ధికి నోచుకోవట్లేదన్నారు. గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయనీ, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లలను తప్పకుండా చదివించాలని గిరిజనులకు డీఆర్వో సూచించారు. గిరిజన నాయకులు మాట్లాడుతూ.. జిల్లాకేంద్రంలో ఏకలవ్య విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలనీ, అట్రాసిటీ కేసుల్లో బాధితులకు పరిహారం చెల్లించాలనీ, సబ్‌ప్లాన్ నిధులు అభివృద్ధికి ఉపయోగించాలని కోరారు. సమావేశంలో గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఆర్డీఓ కేశవనాయుడు, ఆర్‌ఎంఓ డాక్టర్ హేమలత, తహసీల్దార్ హరికుమార్, పాల్గొన్నారు.

వైభవంగా బొలికొండ రంగనాథుడి కల్యాణం





స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకుడు, కల్యాణానికి హాజరైన భక్తులు

గుత్తిరూరల్, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): మండలంలోని జక్కలచెరువు గ్రామంలో వెలసిన బొలికొండ రంగనాథస్వామి ఆలయంలో శనివారం కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా వేకువజామున స్వామివారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన చేశారు. వివిధ పుష్పాలతో అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు శాంతి హోమం చేపట్టారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత బొలికొండ రంగనాథ స్వామి ఉత్సవమూర్తులకు అర్చకులు కల్యాణం నిర్వహించారు. స్వామి వారిని ఎమ్మెల్యే జయరాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ దర్శించుకున్నారు. కల్యాణాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సాయంత్రం ఉత్సవమూర్తులను పల్లకిలో కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి ఊంజల సేవ చేశారు. రాత్రి రాష్ట్రస్థాయి భజనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ శోభ, అర్చకులు రవిస్వామి, నవీన్, చేతన్ పాల్గొన్నారు.

సున్నం వేశాడు..!

సున్నా డౌన్ పేమెంట్, సున్నా వడ్డీతో కార్లు ఇప్పిస్తానంటూ మోసం

డ్రైవర్లకు రూ.3 లక్షలకు కుచ్చుటోపీ

పోలీసులను ఆశ్రయించిన బాధితులు

(వివరాలు 6లో...)

జై హనుమాన్

కసాపురం, మురడి, నేమకల్లు ఆలయాలు కిటకిట

(వివరాలు 6లో..)

వేతనం ఎప్పుడో..?

● పది మూల్యాంకనం ముగిసి నాలుగు నెలలు ● నేటికీ అందని వేతనం.. పట్టించుకోని విద్యాశాఖ (6లో...)

నిరాటంకంగా సాగునీరు

● విప్ కాలవ శ్రీనివాసులు ● పంటలకు నీటి విడుదల

కణేకల్లు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): అన్ని మరమ్మతులు పూర్తి చేసి, ఆయకట్టుకు నిరాటంకంగా నీరిస్తామని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. కణేకల్లు శ్రీ చిక్కణ్ణేశ్వర వడియార్ చెరువు 3 తూముల వద్ద పొలాలకు సాగునీటిని ఆయన శనివారం విడుదల చేశారు. విప్ మాట్లాడుతూ.. హెచ్చెల్సీతో సక్రమంగా నీరు పారేలా రూ.35 కోట్లతో మరమ్మతులు పూర్తి చేశామన్నారు. విపత్కర పరిస్థితిల్లోనూ హెచ్చెల్సీ రైతులకు నీరు అందించామన్నారు. కార్యక్రమంలో హెచ్చెల్సీ డీఈఈ దివాకర్ రెడ్డి, ఏఈఈ నరేంద్ర, మారుతి, చెరువు సంఘం అధ్యక్షుడు బీటీ రమేష్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



నీటిని విడుదల చేసున్న విప్ కాలవ శ్రీనివాసులు



వర్సిటీకి సున్నం

ఫీజు చెల్లింపు చలానాల్లో తేడాలు

తక్కువ చెల్లించి.. సున్నాలు చేర్చి మాయ

పరిశీలనలో వెలుగులోకి విద్యార్థుల అక్రమాలు

విచారణకు కమిటీ వేసిన ఎస్కేయూ అధికారులు



శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం

అనంతపురం రూరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మార్కులు తక్కువగా వచ్చినప్పుడు ఇంట్లో తల్లిదండ్రులు మందలిస్తారని భయపడి.. ప్రోగ్రెస్ రిపోర్ట్‌లో దిద్దుకునే విద్యార్థులను చాలా మంది చూసి ఉంటారు. సున్నాలు చుట్టడం, సున్నాను ఎనిమిదిగా మార్చడం, ఒకటిని ఏడుగా మార్చడం.. ఇలాంటి బురిడీ కొట్టించే సన్నివేశాలు చాలా సినిమాల్లో కూడా చూసే ఉంటారు. ఇలాంటివి పాఠశాల స్థాయిలో చిన్నారులు చేసే చిలిపి చేష్టలుగా భావిస్తారు. ఇలాంటి పనులే కాలేజీ స్థాయిలో చేస్తే..? అందులోనూ ఫీజులు కట్టే చలానాల్లో సున్నాలు చేర్చి.. వందలను వేలుగా మారిస్తే..? నేరమని తెలియక చేశారని క్షమించాలా..? దండించి.. దారిలో పెట్టాలా..? ఉన్నతాధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోగానీ.. ఎస్కేయూలో జరిగిన ఈ 'మస్కా' వ్యవహారం వెలుగులోకి వచ్చింది. వర్సిటీ అధికారులు విచారణకు ఓ కమిటీని ఏర్పాటు చేశారు.

పరిశీలనలో వెలుగులోకి..

ఎస్కేయూ ఫార్మసీ కళాశాలకు కొందరు విద్యార్థులు ఫీజుల చెల్లింపుల్లో అక్రమాలకు పాల్పడ్డారు. ప్రవేశ సమయంలో వసతి గృహాల్లో చేరే విద్యార్థులు ఫీజులను బ్యాంకుల్లో చలానా రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. చలానా పత్రాలను వసతి గృహ కార్యాలయం, కాలేజీలో సమర్పించాలి. ఇదే అదనుగా కొందరు తక్కువ ఫీజు చెల్లించి.. రిసిప్ట్‌లో సున్నాలను చేర్చి.. ఎక్కువ ఫీజు చెల్లించినట్లు బురిడీ కొట్టించారు. కాలేజీలో సమర్పించిన రిసిప్ట్‌లలో సున్నాలు చేర్చిన విషయం వెలుగులోకి వచ్చింది. వర్సిటీలో కళాశాలలు, వసతి గృహాలు ఇటీవల ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో ఫీజులు, ఇతర ధ్రువ పత్రాల పరిశీలన జరుగుతోంది. ఈ సమయంలో బోగస్ చలానాల అంశం బయటపడినట్లు తెలుస్తోంది. వసతి గృహం, ట్యూషన్ ఫీజు రిసిప్ట్ వెరిఫికేషన్‌లో అదనపు సున్నాలను గుర్తించారు. వాటిని తీసుకుని బ్యాంకులో విచారించారు. చలానాల్లో తేడాలు నిజమేనని నిర్ధారించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. చలానాలు మాన్యువల్ కావడంతో విద్యార్థులు ఈ విధంగా బురిడీ కొట్టించినట్లు తెలుస్తోంది.

జీరో బిజినెస్..!

కళాశాల అధికారులు, సిబ్బందిని కొందరు విద్యార్థులు సున్నాలతో బురిడీ కొట్టిస్తున్నారు. ఓ విద్యార్థి రూ.500 ఫీజు చెల్లించి.. చలానా రిసిప్ట్‌లో మూడు సున్నాలను అదనంగా చేర్చాడు. ఇలా ఏకంగా రూ.50 వేలు చెల్లించినట్లు కాలేజీలో చూపించాడు. మరో విద్యార్థి రూ.1400 చలానా కట్టాడు. ఒక సున్నా అదనంగా చేర్చి.. రూ.14 వేలు చెల్లించినట్లు రిసిప్ట్ సమర్పించాడు. కళాశాలలో మరో ముగ్గురు విద్యార్థులు ఇలా చేసినట్లు అధికారులు గుర్తించారు. ఒక్క ఫార్మసీ కళాశాలలోనే కాదని, విశ్వవిద్యాలయంలోని పలు కళాశాల్లో ఇలాంటివి ఉన్నాయని సమాచారం. దీంతో వర్సిటీ ఉన్నతాధికారులు పూర్తిస్థాయి విచారణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న ఆ విద్యార్థులు, కొందరు సంఘాల వారు వర్సిటీ ఉన్నతాధికారులను కలిసినట్లు తెలిసింది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకోవాలని నాయకులు కోరినట్లు తెలుస్తోంది.

ఆరుగురితో కమిటీ..

విశ్వవిద్యాలయంలోని ఫార్మసీ కళాశాలలో బోగస్ చలానాలను గుర్తించాము. రిసిప్ట్‌లో సున్నాలు చేర్చి కాలేజీలో అందజేశారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపిస్తున్నాం. ఆరుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశాం. ఫార్మసీ కళాశాలతో పాటు బీఈడీ, ఇంజనీరింగ్ తదితర కళాశాలల్లోనూ కమిటీ సభ్యులు విచారిస్తారు. నివేదిక వచ్చాక చర్యలు తీసుకుంటాము.

-రమేష్ బాబు,
రిజిస్ట్రార్, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం

దండించాడని... దాడి

బాధితుడి మృతి.. 24 గంటల్లో నిందితుడి అరెస్టు (6లో...)



వైసీపీ పాపాలు..!



అహుడా కార్యాలయం

(5వ పేజీ తరువాయి)

40వేల మందికిపైగా లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరనుందని అహుడా వర్గాలు చెబుతున్నాయి.

ప్రభుత్వ ఆదాయానికి గండి

అనుమతులు తీసుకోకుండా వేసిన లేఅవుట్లతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతున్నారు. డెవలప్‌మెంట్ చార్జీలు, ఫీజులు చెల్లించకుండా అక్రమంగా లేఅవుట్లు వేసేశారు. కొందరు అధికారులు.. వైసీపీ నేతలతో కుమ్మక్కై యథేచ్ఛగా అక్రమ లేఅవుట్లకు సహకరిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. అహుడాలో పనిచేసే ఓ ఇంజనీరు.. వైసీపీ నాయకులతో బహిరంగంగానే చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నారనే చర్చ సాగుతోంది. గతంలో ఆ ఇంజనీరు అనంత నగరపాలక సంస్థ పబ్లిక్ హెల్త్ విభాగంలో పనిచేసిన సమయంలోనే భారీగా అక్రమార్జనకు మరిగారనే పేరు మూటగట్టుకున్నారు. తననెవరూ ఏమీ చేసుకోలేరనే ధీమాతోనే అక్రమాలకు ఆజ్యం పోస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చినా వైసీపీ నేతల కనుసన్నల్లోనే ఆ ఇంజనీరు పనిచేస్తుండడం గమనార్హం.

నగర శివారులోనే అధికం

అనంతపురం నగర శివారులోనే అత్యధికంగా అనధికార లేఅవుట్లు వెలిశాయి. గోవిందంపల్లిలో సర్వే నంబర్లు 78, 145, 165, వడియంపేట గ్రామ పంచాయతీ పొడరాళ్ల పరిధి సర్వే నంబర్ల 295, 279, 84, 85, 87లో అనధికారికంగా వేసిన లేఅవుట్లలో రాళ్లను ఇటీవల అహుడా అధికారులు తొలగించారు. నారాయణపురం పంచాయతీలోని సర్వే నంబరు 104, 202లో (10.8 ఎకరాలు), సర్వే నంబరు 142,145లలో (2.8 ఎకరాలు). నరసనాయుని కుంట పంచాయతీలో సర్వే నంబరు 111, 117లలో (6.5 ఎకరాలు), సర్వే నంబరు 113లో ఎకరం, సర్వే నంబరు 121లో (6.4 ఎకరాలు), సర్వే నంబరు 124, 126లలో (4.6ఎకరాలు), కక్కలపల్లి పంచాయతీలో సర్వే నంబరు 191లో (8ఎకరాలు), సర్వే నంబరు 183లో (2.1ఎకరాలు), సోములదొడ్డి పంచాయతీలో సర్వే నంబరు 62లో (11.5) ఎకరాల్లో వేసిన అనధికార లేఅవుట్లలోని రాళ్లను ఆయా పంచాయతీ కార్యదర్శులతో కలిసి అహుడా ప్లానింగ్ అధికారులు తొలగించారు.

అన్నింటినీ క్రమబద్ధీకరించుకోవాల్సిందే

-టీసీ వరుణ్, అహుడా చైర్మన్



అహుడా పరిధిలోని అనధికార లేఅవుట్లు అన్నింటినీ క్రమబద్ధీకరించుకోవాల్సిందే. లేదంటే బ్లాక్‌లిస్టులో పెట్టేస్తాం. అహుడా పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఉన్న అనధికారి లేఅవుట్ల వివరాలను సేకరించి, ఎల్ఆర్ఎస్ వర్తింపజేసేలా ప్రణాళికలు రూపొందించాం.

చిన్నారుల వృక్షా బంధన్



చెట్టుకు రాఖీ కడుతున్న విద్యార్థులు

కుందుర్పి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): సమాజక్రాంతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మండలవ్యాప్తంగా నిర్వహిస్తున్న విలువల బడుల్లో వృక్షా బంధన్ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. రక్షాబంధన్ రోజున విద్యార్థులందరూ తాము నాటిన చెట్లకు రాఖీలు కడుతూ పర్యావరణ పరిరక్షణ, చెట్ల సంరక్షణకు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో విలువల బడుల ఉపాధ్యాయులు నాగరాజు, దిలీప్, అనిత, మల్లికార్జున, ఆశాలక్ష్మి, శ్రీలత, రఘువరన్, హనుమంతరాయుడు, కోఆర్డినేటర్ శ్రీకాంత్ విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు. రక్షాబంధన్ రోజున మానవ సంబంధాలను, విలువలను తెలియజేయడంతోపాటు పర్యావరణ పరిరక్షణ కోసం ఈ స్ఫూర్తిదాయక కార్యక్రమాన్ని నిర్వహించిన విద్యార్థులు, ఉపాధ్యాయులను సమాజ క్రాంతి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు ఎస్‌కే లెనిన్ బాబు అభినందించారు.

దేవుడిచ్చిన అన్నయ్యకు రాఖీ

ఎంఎస్ రాజుకు రాఖీ కట్టిన పల్లె సింధూర



ఎంఎస్ రాజుకు రాఖీ కడుతున్న సింధూరారెడ్డి

అనంతపురం క్రైం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజుకు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి రాఖీ కట్టారు. నగరంలోని ఎంఎస్ రాజు నివాసానికి శనివారం సింధూరా రెడ్డి వెళ్లి ఆయనకు రాఖీ కట్టారు. అనంతరం ఆ మెకు రాజు దంపతులు చీర, సారె పెట్టి గౌరవించారు. దేవుడిచ్చిన అన్నయ్యకు రాఖీ కట్టడం ఎంతో ఆనందంగా ఉందని పల్లె సింధూర పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

అనంతపురం క్రైం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి చెందిన ఆరుగురికి రూ. 6.47లక్షల మేర సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. వాటికి సంబంధించిన చెక్కులను నగరంలోని తన కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఈ 14 నెలల్లోనే సుమారు రూ 1.75 కోట్ల మేర సీఎం రిలీఫ్ ఫండ్ అందించినట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇలాంటి సాయం ఎవరికీ అందలేదన్నారు. జగన్ పాలనంతా ప్రజావ్యతిరేకంగానే సాగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు బుగ్గయ్యచౌదరి, కోనంకి గంగారామ్, అహ్మద్, కడియాల కొండన్న, చేపల హరి, గోపాల్ గౌడ్, నెట్టెం బాలకృష్ణ, సుధాకర్ యాదవ్, లక్ష్మీ నరసింహ, దుర్గేష్ పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

వేతనం ఎప్పుడో..?

పది మూల్యాంకనం ముగిసి నాలుగు నెలలు

నేటికీ అందని వేతనం... పట్టించుకోని విద్యాశాఖ



మూల్యాంకనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ కిష్టప్ప (ఫైల్)

ధర్మవరం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పది పరీక్షల మూల్యాంకన వేతనాలు విద్యాశాఖ ఎప్పుడు ఇస్తుందోనని ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారు. మూల్యాంకనం ముగిసి నాలుగు నెలలైనా ఇంతవరకు చెల్లింపుల్లేవు. దూరప్రాంతాల నుంచి సొంత ఖర్చులు పెట్టుకుని వచ్చిన ఉపాధ్యాయులు మూల్యాంకన వేతనాల కోసం పడిగాపులు కాస్తున్నారు. ఒక్కో ఉపాధ్యాయుడికి సగటున 6 వేల వరకు, సహాయకులకు 3 వేలు చొప్పున చెల్లించాల్సి ఉంది. శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా 1,500 మంది టీచర్లకు రూ.72.8 లక్షలు, 200 మంది సహాయకులకు రూ.13.09 లక్షలు మూల్యాంకన నిధులు విడుదల కావాల్సి ఉందని విద్యాశాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది. వేతన చెల్లింపుల కోసం ఉన్నత, జిల్లాస్థాయిలో అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఫీజు రూపంలో వసూలు చేసినా..

మూల్యాంకన చెల్లింపులకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు విడుదల చేయాల్సిన అవసరం లేదు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఫీజులు చెల్లిస్తారు. ఇలా వసూలు చేసిన సొమ్మును ప్రశ్నాపత్రాల ముద్రణ, కేంద్రాల నిర్వహణ, ప్రశ్నాపత్రాల రవాణా, ఇన్విజిలేటర్ల భత్యం, మూల్యాంకన వేతన చెల్లింపుల కోసం వినియోగించాలి. కావున, పరీక్షల ప్రక్రియకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు ఇవ్వాల్సిన అవసరం లేదు. విద్యార్థుల నుంచి పరీక్షల ఫీజు వసూలు చేస్తున్నారు. విద్యార్థులు జాప్యం చేస్తే జరిమానాలు వేస్తున్నారు. ప్రభుత్వం చెల్లింపుల్లో జాప్యం ఎందుకు చేస్తుందో అర్థం కావడంలేదని ఉపాధ్యాయ సంఘాల నాయకులు మండిపడుతున్నారు.

ఏటా ఇదే తంతు

పదో తరగతి మూల్యాంకన చెల్లింపుల విషయంలో జాప్యం జరుగుతోందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. గతేడాది పది సప్లిమెంటరీ పరీక్షల మూల్యాంకన వేతనం నేటికీ పూర్తిస్థాయిలో చెల్లించలేదని ఉపాధ్యాయులు వాపోతున్నారు. దాదాపు పది రోజులపాటు ఉపాధ్యాయులు మూల్యాంకన విధుల్లో పాల్గొన్నారు. ఇతరప్రాంతాల నంచి వచ్చిన వారికి డీఏ కూడా చెల్లించాలి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మూల్యాంకన నిధులు విడుదల చేయాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

వెంటనే చెల్లించాలి



మూల్యాంకన వేతనాలు అధికారులు వెంటనే చెల్లించాలి. జిల్లాలో చాలామంది టీచర్లు సొంత ఖర్చులు పెట్టుకుని మూల్యాంకనానికి హాజరయ్యారు. మామూలుగా మూల్యాంకనం జరిగిన వెంటనే ఇవ్వాలి. అసలు మూల్యాంకనం రుసుం ప్రభుత్వం నుంచి విడుదలైంది. జిల్లా విద్యాశాఖ అధికారులే ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇలాగైతే భవిష్యత్తులో మూల్యాంకన విధులు అంటనే ఉపాధ్యాయులు వెనకడుగు వేస్తారని ఉపాధ్యాయ వర్గాలు వాపోతున్నాయి.

-సానె రవీంద్రారెడ్డి, ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు

త్వరగా ఇవ్వాలి

- సుధాకర్, జిల్లా ప్రధానకార్యదర్శి, యూటీఎఫ్



ప్రభుత్వం మూల్యాంకన వేతనాన్ని త్వరగా చెల్లించాలి. మూల్యాంకనం పూర్తయి నాలుగు నెలలు గడుస్తున్నా నేటికీ వేతనం చెల్లించకపోవడంలో అంతర్యమేమిటి? విద్యాశాఖ అధికారులు కూడా ఉపాధ్యాయులతో పని చేయించుకుని వారికి వేతనం ఇవ్వడంలో అలసత్వం వహిస్తున్నారు.

మూడు రోజుల్లో జమవుతుంది

-కిష్టప్ప, డీఈఓ

పదో తరగతి మూల్యాంకనం చేసిన టీచర్లకు వేతనం మూడు రోజుల్లో వారి ఖాతాల్లోకి జమవుతుంది. బడ్జెట్ వచ్చింది. వేతనాల బిల్లులు ట్రెజరీకి పంపాం. మూడు రోజుల్లో వేతనం జమవుతుంది.



కసాపురంలో స్వామికి అలంకరణ



నేమకల్లులో..



మురడిలో...



నేమకల్లులో స్వామివారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

జై హనుమాన్

అంజన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు

కసాపురం, మురడి, నేమకల్లు ఆలయాలు కిటకిట

గుంతకల్లు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): శ్రావణ పౌర్ణమి, శనివారం కావడంతో జిల్లాలోని ప్రసిద్ధి చెందిన ఆంజనేయ స్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. కసాపురంలోని శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామివార్లకు గజ వాహనోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి మూల విరాట్టుకు వేకువనే అభిషేకాలు చేశారు. వజ్రఖచిత స్వర్ణాభరణ అలంకారాలు చేశారు. సెలవు దినం కూడా కావడంతో ఉదయం నుంచీ రాత్రి 9 గంటల వరకూ ఇసుకేస్తే రాలనంత మంది భక్తులు స్వామివారి దర్శనార్థం తరలివచ్చారు. దీంతో పట్టణంలో పలుమార్లు ట్రాఫిక్ జామ్ అయింది. క్యూలైన్లను నియంత్రించడానికి పోలీసులు, ఆలయ అధికారులు, సిబ్బంది, వలంటీర్లు ఆపసోపాలు పడాల్సి వచ్చింది. ఆలయంలో సుందరకాండ పారాయణం, హనుమాన్ చాలీసా పఠనం, మధ్యాహ్నం మహా మంగళహారతి ఇచ్చారు. సాయంత్రం గజ వాహనంపై శ్రీ సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయ స్వాముల ఉత్సవ విగ్రహాలను సర్వాంగ సుందరంగా అలంకరించి, ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు.

నేమకల్లు కిటకిట..

బొమ్మనహాళ్(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు శ్రీ ఆంజనేయస్వామి దర్శనానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. దీంతో ఆలయం భక్తజనసంద్రంగా మారింది. సర్వదర్శనానికి 2 గంటలుపైగా పట్టింది. కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి రూరల్ మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్ రెడ్డి, కంప్లి మాజీ ఎమ్మెల్యే సురేష్ బాబు.. స్వామివారిని దర్శించుకున్నారు.

మార్మోగిన అంజన్న నామం

డీ హీరేహళ్(ఆంధ్రజ్యోతి): మండలంలోని మురడి గ్రామం అంజన్న నామస్మరణతో మార్మోగింది. గ్రామంలో వెలసిన శ్రీ ఆంజనేయస్వామి దర్శనానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకాలు చేసి, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కర్ణాటకలోని కురుగోడు మాజీ ఎమ్మెల్యే నారా సూర్యనారాయణ రెడ్డి పూజలు నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు. కసాపురం, మురడి, నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయాలను ఉప లోకాయుక్త రజని సందర్శించారు.

భక్తిశ్రద్ధలతో ఏడు శనివారాల వ్రతం



ఆర్ఎఫ్ రోడ్డు లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు అందుకుంటున్న స్వామి, అమ్మవార్లు

అనంతపురం టౌన్, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): ఏడుశనివారాల వ్రతాల్లో భాగంగా నగరంలోని పలు ఆలయాల్లో వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆర్ఎఫ్ రోడ్డు, రామ్‌నగర్‌లోని వెంకటేశ్వర స్వామి, అశోక్‌నగర్‌లోని సత్యనారాయణస్వామి ఆలయాలతోపాటు శారదానగర్‌లోని శృంగేరి శంకరమఠంలో వేదపండితులు వేద మంత్రోచ్చారణల నడుమ శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామిల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పూజాది కైంకర్యాలు నిర్వహించారు. పండితులు వ్రతవిశిష్టతను వివరిస్తుండగా భక్తులు సామూహికంగా వ్రతాలను ఆచరించారు.

పుస్తకావిష్కరణ సభకు తరలిరండి

అనంతపురం టౌన్, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): జిల్లా రచయితల సంఘం(జిరసం) ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో పుస్తకావిష్కరణ సభ జరగనుందని, విజయవంతం చేయాలని జిరసం అధ్యక్షుడు కొత్తపల్లి సురేష్ శనివారం ప్రకటనలో పిలుపునిచ్చారు. అందులో సీనియర్ కవి గుడిపాటి సూర్యం రచించిన 'జీవన శిల్పి' కవితా సంపుటిని ఆవిష్కరించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు విరివిగా పాల్గొనాలని కోరారు.

పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం విద్య, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందిస్తున్నామనీ, ఉమ్మడి జిల్లాలోని టీచర్లు దరఖాస్తు చేసుకోవచ్చని ఆత్మీయట్రస్టు చైర్మన్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జయచంద్రారెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. మెరుగైన బోధన, విద్యార్థుల అభ్యున్నతికి కృషి, క్రమశిక్షణ కలిగిన టీచర్లు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత గల టీచర్లు ఈనెల 20వ తేదీలోగా దరఖాస్తులు అందజేయాల్సి ఉంటుందని జయచంద్రారెడ్డి కోరారు. వివరాలకు 9030944717 నంబరులో సంప్రదించాలన్నారు.

బీఏఎస్‌ను పునరుద్ధరించాలి

- ఎమ్మార్పీఎస్

అనంతపురం వైద్యం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను చదివించేలా బెస్ట్ అవలబుల్ స్కూల్ (బీఏఎస్) పథకాన్ని పునరుద్ధరించాలని ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధికార ప్రతినిధి అక్కులప్ప రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. నగరంలోని సంఘం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019కి ముందు సీఎంగా ఉన్న చంద్రబాబు బీఏఎస్‌ను తీసుకొచ్చారన్నారు. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి ఆ పథకాన్ని తొలగించారన్నారు. దీంతో వందలాది మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు గత ఐదేళ్లలో కార్పొరేట్ పాఠశాలలకు దూరమయ్యారని వాపోయారు. తిరిగి చంద్రబాబు అధికారంలోకి రావడంతో బీఏఎస్‌పై వారి తల్లిదండ్రుల్లో ఆశలు పెరిగాయన్నారు. అయితే ఏడాది గడిచినా బీఏఎస్‌పై ప్రభుత్వం మాట్లాడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి బీఏఎస్‌ను పథకాన్ని పునరుద్ధరించాలని కోరారు. నాయకులు అంజినప్ప, ఉదయ్‌కుమార్, రామాంజనేయులు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సున్నం వేశాడు..!

సున్నా డౌన్ పేమెంట్, సున్నా వడ్డీతో కార్లు ఇప్పిస్తానంటూ మోసం

డ్రైవర్లకు రూ.3 లక్షలకు కుచ్చుటోపీ

పోలీసులను ఆశ్రయించిన బాధితులు

గార్లదిన్నె, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): జీరో డౌన్ పేమెంట్... జీరో ఇంట్రెస్ట్‌తో కొత్త కార్లు ఇప్పిస్తానని నమ్మబలికి డ్రైవర్లకు కుచ్చుటోపీ పెట్టాడు ఓ మోసగాడు. జాతీయ రహదారి పనులు చేసే సంస్థలో అద్దెకు పెట్టిస్తానంటూ డబ్బు వసూలు చేసి, ఉడాయించాడు. గార్లదిన్నెలో విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గార్లదిన్నె, శింగనమల మండలాలకు చెందిన రమేష్, దేవరాజు, నాగరాజు, వెంకటేష్, తిమ్మయ్య కారు డ్రైవింగ్ చేసుకుంటూ కుటుంబాలను పోషించుకునేవారు. వారికి గార్లదిన్నెలో ఓ మహిళతో పరిచయం ఏర్పడింది. ఆమె ఎన్‌హెచ్ఏఐలో జనరల్ మేనేజర్‌గా ఉద్యోగం చేస్తున్నానని చెప్పింది. సాయి అనే వ్యక్తి తనతోపాటు ఉద్యోగం చేస్తున్నాడని అతడిని డ్రైవర్లకు పరిచయం చేసింది. తనది రాజమండ్రి అనీ, తాను ఎన్‌హెచ్ఏఐలో ఉద్యోగం చేస్తున్నానని అతడు చెప్పాడు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో ఎన్‌హెచ్ పనులు చేపడుతున్నారనీ, అందులో చాలామంది ఉద్యోగులున్నారన్నారు. కార్యాలయం మాత్రం అనంతపురంలో ఉందన్నాడు. ఉద్యోగులు రోజూ అనంతపురం నుంచి ధర్మవరానికి రాకపోకలు సాగిస్తున్నారని నమ్మబలికారు. అందుకు కార్లు అద్దెకు కావాలని తెలిపారు. ఎన్‌హెచ్ పనులు ఐదేళ్లు ఉంటాయనీ, జీరో డౌన్‌పేమెంట్‌తో కార్లు ఇప్పిస్తానని డ్రైవర్లకు ఆశ చూపాడు. డీజిల్ అంతా కంపెనీనే భరిస్తూ కారుకు నెలకు రూ.40వేలు, డ్రైవర్‌కు రూ.17వేలు మొత్తం రూ.57వేలు ఇప్పిస్తానన్నాడు. కార్లకు బాడుగలు లేక కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిన తరుణంలో డౌన్ పేమెంట్, వడ్డీ లేకుండా కొత్తకార్లు వస్తాయని చెప్పడంతో డ్రైవర్లు నమ్మారు. 5 సంవత్సరాలు అగ్రిమెంట్ చేయాల్సి ఉంటుందని సాయి నమ్మబలికాడు. అందుకు డ్రైవర్లు ఓకే చెప్పారు. అగ్రిమెంట్‌కు ఒక్కొక్కరు రూ.10వేలు... కారు బుకింగ్ కోసం రూ.50వేలు ఇవ్వాల్సి ఉంటుందన్నాడు. ఇందుకు డ్రైవర్లు ఒక్కక్కరు రూ.10వేలు ఫోన్ పే చేసి, రూ. 50వేలు నగదు రూపంలో సాయికి అందజేశారు. ఇలా ఐదుగురు మొత్తం రూ.3 లక్షలు ముట్టజెప్పారు. మూడు నెలలు కావస్తున్నా కొత్తకార్లు రాలేదు. డ్రైవర్లకు అనుమానం వచ్చి సాయికి ఫోన్ చేశారు. అదిగో...ఇదిగో.. అంటూ కాలయాపన చేయసాగాడు. 'నాతో డబ్బు ల్లేవు. ఏం చేసుకుంటారో చేసుకోండి' అని బెదిరించాడు. దీంతో సాయిని పరిచయం చేసిన మహిళను డ్రైవర్లు నిలదీశారు. తనకు సంబంధం లేదని మహిళ చెప్పింది. ఆమెతో కారు డ్రైవర్లు వాదనకు దిగారు. తాను కూడా కార్ల కోసం డబ్బు కట్టి, మోసపోయనని మహిళ వాపోయింది. దీంతో కారు డ్రైవర్లు, మహిళ.. పోలీసులను ఆశ్రయించారు. సాయి అనే వ్యక్తి తమకు కార్ల ఆశ చూపి మోసం చేశాడనీ, న్యాయం చేయాలని కోరారు. విచారణ చేసి న్యాయం చేస్తామని గార్లదిన్నె పోలీసులు తెలిపారు.

దండించాడని... దాడి

బాధితుడి మృతి.. 24 గంటల్లో నిందితుడి అరెస్టు



నిందితుడితో త్రీటౌన్ పోలీసులు

అనంతపురం క్రైం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): చిన్నా, పెద్దా లేదా అంటూ గుర్తు తెలియని వ్యక్తి దండించాడన్న కోపంతో పిడిగుద్దలు గుద్దడంతో అతడు స్పృహతప్పి పడి మరణించాడు. దాడి చేసి పారిపోయిన నిందితుడిని త్రీటౌన్ పోలీసులు 24 గంటల్లో పట్టుకున్నారు. శనివారం త్రీటౌన్ సీఐ శాంతిలాల్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం 6.30 గంటలపుడు శ్రీనివాసనగర్‌లోని అన్న క్యాంటీన్ వద్ద ఘర్షణ జరిగింది. శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం మంగళమడక గ్రామానికి చెందిన చిన్న వెంకటరాముడు(50) స్వీపర్‌గా పనిచేస్తుండేవాడు. శ్రీనివాసనగర్‌లోని రాముని గుడి వద్ద నివాసం ఉండేవాడు. ఆయన అన్న క్యాంటీన్ వద్ద ఉండగా, వినాయకనగర్‌కు చెందిన బర్లోళ్ల రామంజి అలియాస్ రామాంజనేయులు(33) అక్కడికి వచ్చాడు. నిలబడిన ఉన్న చిన్న వెంకటరాముడిని మాట్లాడిస్తూ... 'మావాళ్లు ఏమైనా ఇక్కడ వచ్చినారా ఓయ్...!' అన్నాడు. దీంతో వయసురీత్యా పెద్ద అయిున చిన్న వెంకటరాముడు 'నువ్వు ఎవరు నన్ను అడుగుతావు... చిన్న, పెద్ద తేడా లేదా..?' అంటూ దండించాడు. దీంతో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగింది. కోపం మీద ఉన్న రామాంజనేయులు ఒక్కసారిగా వెంకటరాముడు మొహం, ఛాతీపై మూడు, నాలుగుసార్లు పిడిగుద్దులు గుద్దాడు. దీంతో చిన్న వెంకటరాముడు స్పృహతప్పి పడి, మరణించాడు. విచారణ చేపట్టిన పోలీసులు సీసీ టీవీ ఫుటేజీ ఆధారంతో నిందితుడిని రైల్వేస్టేషన్ వద్ద పట్టుకున్నారు. అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపారు.

విస్తారంగా వర్షాలు

అనంతపురం అర్బన్, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని మండలాల్లో శుక్రవారం వర్షం కురిసింది. అత్యధికంగా వజ్రకరూరులో 86.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఆత్మకూరు 70.4, శెట్టూరు 68.4, బెళుగుప్ప 65.4, విడపనకల్లు, తాడిపత్రి 61.4, గుమ్మఘట్ట, బ్రహ్మసముద్రం 58.2, పెద్దవడుగూరు 52.4, యల్లనూరు 49.8, యాడికి 48.4, గార్లదిన్నె 46.4, కంబదూరు 45.4, ఉరవకొండ 45.2, రాయదుర్గం 43.2, కుందుర్పి 39.6, కళ్యాణదుర్గం 39.0, అనంతపురం 32.4, గుంతకల్లు 30.2, శింగనమల 28.4, పామిడి 25.2, కణేకల్లు, రాప్తాడు 21.0, డి.హిరేహాళ్, బుక్కరాయసముద్రం 20.2, పుట్లూరు 19.4, కూడేరు 18.4, నార్పల 16.6, పెద్దపప్పూరు 9.6, బొమ్మనహాళ్ 4.0 మి.మీ. వర్షపాతం నమోదైంది.

'బీసీలకు 49శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి'

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీలకు విద్య, ఉపాధి, చట్టసభల్లో 49శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఏపీ స్టూడెంట్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు అమర్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని జేఏసీ కార్యాలయంలో శనివారం ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. 5శాతం ఉన్న అగ్రవర్ణాలే ఆధిపత్యం చలాయిస్తుంటే... 56ఉన్న బీసీలు బానిసలుగా బతకాల్సివస్తోందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిననాటి నుంచి బీసీలకు 27శాతం రిజర్వేషన్లు వస్తున్నాయని, పాలకులు మారినా బీసీలకు రిజర్వేషన్లు పెంచడంలో అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీహార్, తెలంగాణ రాష్ట్రాల తరహాలో ఏపీలో కూడా జనాభాకు అనుగుణంగా బీసీలకు 49శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, నరేష్, అభిరామ్, పార్థు, గోవర్ధన్, ప్రేమానంద్ పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్‌కు ఏకలవ్యుడి పేరు పెట్టాలి

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): నగరంలో టవర్‌క్లాక్ వద్ద నిర్మించిన ఫ్లైఓవర్‌కు ఏకలవ్యగా నామకరణం చేయాలని ఏకలవ్య ట్రైబల్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకట రామయ్య కోరారు. ఈ మేరకు శనివారం డీఆర్‌ఓ మలోలాను కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే పలు సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు బ్రహ్మయ్య, చంద్రప్ప, చిన్నలింగన్న, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

అండర్ డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలని వినతి

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): నగరంలో అండర్‌డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేసి మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ నాయకులు కోరారు. ఈమేరకు శనివారం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరాములు మాట్లాడుతూ నగరంలో చిన్నపాటి వర్షం వచ్చినా లోతట్టు ప్రాంతాలు వరదల్లో చిక్కుకుని ప్రజలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. ప్రధాన రహదారుల్లో సైతం వర్షం నీరు నిలబడి ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందన్నారు. ఆక్రమణకు గురైన మురుగుకాలువలను క్రమబద్ధీకరించి వెడల్పు చేయాలని విన్నవించారు.

'కొత్తచెరువు చరిత్ర' అమోఘం

ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె

కొత్తచెరువు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కొత్తచెరువు చరిత్రను భావితరాలకు అందించేందుకు విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు వెంగన్న కృషి అమోఘమని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి కొనియాడారు. వెంగన్న రచించిన కొత్తచెరువు సమగ్ర చరిత్ర పుస్తకావిష్కరణ స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పుస్తకావిష్కరణ అనంతరం వారు మాట్లాడుతూ.. కొత్తచెరువు గ్రామ పుట్టుక, అభివృద్ధికి సంబంధించిన వెయ్యేళ్ల చరిత్రను పుస్తకంగా భావితరాలకు అందించడం గొప్ప విషయమన్నారు. ఈ పుస్తకంలో బుక్కపట్నం చెరువు నిర్మాణ చరిత్ర, విజయనగర రాజుల సేవలు, విద్య, వైద్యం, వ్యవసాయ అభివృద్ధి గురించి రచయిత సమగ్రంగా వివరించారన్నారు. గ్రామంలో పలు వంశాల చరిత్రను కూడా ఈ పుస్తకం ద్వారా తెలియజేశారన్నారు. దాదాపు 15 సంవత్సరాలు పరిశోధన చేసి 2021 నుంచి ఈ పుస్తకం వెంగన్న రాశారన్నారు. కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు, విశ్రాంత ఉపాధ్యాయులు, ప్రజలు పాల్గొన్నారు.

ముంచిన వాన

- ధర్మవరంలో భారీ వర్షం
- మగ్గం గుంతల్లోకి చేరిన వర్షపు నీరు
- తెల్లవార్లు జాగరణ చేసిన నేతన్నలు
- భృతి ఇవ్వాలంటున్న చేనేత కార్మికులు

ధర్మవరం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మగ్గం గుంతల్లోకి నీరింది. దీంతో చేనేత కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పట్టణంలోని వైఎస్ఆర్, ఇందిరమ్మ, కేతిరెడ్డి కాలనీలలో 30 మగ్గాల ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. దీంతో మగ్గాల గుంతలన్నీ నిండటంతోపాటు నిత్యావసర సరుకులు, ఇతర వస్తువులు తడిసిపోయాయి. చేనేత కార్మికులు మగ్గం గుంతల్లో, ఇళ్లలోకి చేరిన నీటిని తెల్లవార్లు తోడేశారు. చేనేత కార్మికులు మాట్లాడుతూ.. డ్రైనేజీలు నిర్మించకపోవడం, ఇంటి ఎదుట రోడ్లు ఎత్తుగా ఉండటంతో వాన నీరంతా ఇళ్లకి వచ్చినట్లు తెలిపారు. తెల్లవార్లు ఈ నీటిని ఎత్తిపోస్తూ జాగారం చేసినట్లు పలువురు బాధితులు తెలిపారు. మగ్గాలన్నీ తడిసిపోవడంతో నెలరోజులపాటు ఉపాధిని కోల్పోయామని ఆవేదన వ్యక్తంచేశారు. టీడీపీ హయాంలో వర్షాకాలంలో వర్షాకాలపు భృతి ఇచ్చారని, ఆ దిశగా ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మూడునెలలపాటు వర్షాకాలపు భృతి ఇవ్వాలని కోరారు.



ధర్మవరంలోని ఇందిరమ్మకాలనీలో ఇళ్లలోకి చేరిన వాననీరు



ధర్మవరంలో ఓ ఇంటి ముందు నిలిచిన వాన నీరు

పరిశీలించిన కమిషనర్, టీడీపీ నాయకులు

పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో వర్షాలకు నష్టపోయిన కుటుంబాలను మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, టీడీపీ నాయకులు శనివారం పరిశీలించారు. తడిసిపోయిన మగ్గం గుంతలు, ఆహారధాన్యాలు, ఇతర సామగ్రిని పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి పురుషోత్తంగౌడ్, నాయకులు బొట్టు కిష్ట పాల్గొన్నారు.

పొంగిన వాగులు, వంకలు

ధర్మవరంరూరల్: ఉరుములు, మెరుపులతో కూడి వర్షం కురవడంతో మండలంలోని వాగులు, వంకలు పొంగిపొర్లాయి. మండల వ్యాప్తంగా శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు వర్షం కురిసింది. ధర్మవరంలో 52..06మిమీ వర్షపాత నమోదైనట్లు ఏఎస్ఓ శర్మ తెలిపారు. మండలంలోని గొట్లూరు గ్రామంలో ఇళ్ల మధ్యన భారీగా వర్షపునీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పదేళ్లుగా వర్షం వచ్చినపుడల్లా ఇబ్బంది పడుతున్నట్లు వారు పేర్కొన్నారు.

ఉపాధి కోల్పోయాం



భారీ వర్షానికి మగ్గాలన్నీ తడిసిపోయాయి. ఇళ్లలోకి, మగ్గం గుంతల్లోకి వచ్చిన నీటిని తోడేసేందుకు శుక్రవారం తెల్లవార్లు జాగరణ చేశాం. ఇంటిలోని నిత్యావసర సరుకులు, వస్తువులు పూర్తిగా తడిసిపోయాయి. దీంతో చాలా ఇబ్బందులుపడ్డాం. కాలనీలో ఎగువ ప్రాంతం నుంచి వర్షపు నీరు వచ్చి ఇళ్లలోకి చేరింది. కాలనీల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు లేకపోవడమే ఇందుకు కారణం. -సరస్వతి, చేనేత కార్మికురాలు, ఇందిరమ్మ కాలనీ

వర్షాకాలపు భృతి ఇవ్వాలి



ప్రతి ఏడాది వర్షాకాలంలో ఇబ్బందులు పడుతూనే ఉన్నాం. వర్షాలు ఎక్కువగా వచ్చినప్పుడు ఇళ్లలోకి నీరు చేరి మగ్గాలన్నీ పూర్తిగా తడిసిపోతాయి. అవి ఆరడానికే నెలరోజులు పడుతుంది. దీంతో ఉపాధి కోల్పోతాం. గతంలో టీడీపీ ప్రభుత్వం మూడునెలల పాటు బియ్యంతోపాటు నిత్యావసర సరుకులు అందజేసేది. కూటమి ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకోవాలి. -కిష్టప్ప, చేనేత కార్మికుడు, ఇందిరమ్మ కాలనీ



ఇందిరమ్మ కాలనీలో రోడ్లను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, టీడీపీ నాయకులు

క్రైం కార్నర్

వివాహేతర బంధానికి అడ్డమనే హత్య!

భార్య సహా ఐదుగురి అరెస్ట్



నిందితులను చూపుతున్న లేపాక్షి ఎస్ఐ నరేంద్ర, సిబ్బంది

లేపాక్షి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని సడ్లపల్లి పంచాయతీ తిలక్‌నగర్‌లో ఈనెల 2న వెలుగు చూసిన హత్యకు సంబంధించి ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు. తమ వివాహేతర బంధానికి అడ్డుగా ఉన్నాడని షేక్ దాదాపీర్‌ను(28) ఆయన భార్య ప్రియుడితో కలిసి హత్య చేసినట్లు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో అరెస్టు వివరాలను విలేకరులకు శనివారం వివరించారు. పరిగి గ్రామానికి చెందిన దిల్షాద్ 11 ఏళ్ల కిందటే భర్తను వదిలేసి ఒంటరిగా ఉండేది. ఆమెకు హిందూపురం త్యాగరాజ్‌నగర్‌కు చెందిన షేక్ దాదాపీర్‌తో రెండో పెళ్లి జరిగింది. షేక్ దాదాపీర్(28) వెల్డింగ్ పనులు చేసుకుంటూ చిన్న చిన్న దొంగతనాలు చేసుకుంటూ స్నేహితులతో జులాయిగా తిరిగేవాడు. అప్పుడప్పుడు తన స్నేహితులను ఇంటికి తీసుకొచ్చేవాడు. ఈక్రమంలోనే తన భర్త స్నేహితుల్లో ఒకడైన పవన్‌తో దిల్షాద్‌కు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న దాదాపీర్ తన భార్య, పవన్‌కుమార్‌ను హెచ్చరించాడు. దీంతో వారిద్దరూ దాదాపీర్ అడ్డు తొలగించుకోవాలనుకున్నారు. ఈ క్రమంలో పవన్ తన స్నేహితులు నరసింహులు, బుడేన్‌సాబ్ ఇనాయతుల్లా, బాబాఅఫ్రీదిలతో కలిసి దాదాపీర్‌ను మద్యం తాగేందుకు ఆటోనగర్‌లోని ఓ పాడుబడ్డ ఇంట్లోకి తీసుకెళ్లారు. అక్కడ మద్యం సేవించి పదునైనా ఆయుధంతో హత్యచేసి పరారయ్యారు. కొంతమంది అందించిన సమాచారంతో మృతుడు దాదాపీర్ తల్లి షేక్ రహ్మతున్నీసా ఘటనస్థలానికి వెళ్లి కుమారుడిని గుర్తుపట్టి లేపాక్షి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. హిందూపురం రూరల్ సీఐ జనార్దన్ ఆధ్వర్యంలో పోలీసులు విచారణ చేపట్టారు. ఈక్రమంలో శనివారం మలిరెడ్డిపల్లి దర్గావద్ద ఉన్న దిల్షాద్ సహాఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారు నేరం అంగీకరించడంతో కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

పెనుకొండ రూరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వైష్ణవి అనే యువతి అదృశ్యమైనట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన కారు డ్రైవర్ ప్రకాశ్ కుమార్తె వైష్ణవి ఇంటర్ పూర్తి చేసింది. మూడు రోజుల కిందట ఇంటి నుంచి కంప్యూటర్ క్లాసుకు వెళ్తున్నాని చెప్పి బయటకు వెళ్లింది. ఎంతసేపటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెదికారు. ఆచూకీ దొరక్కపోవడంతో పెనుకొండ పోలీస్ స్టేషన్‌లో అమ్మాయి తండ్రి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఫిబ్రవరిలో మృతి.. ఇప్పుడు పోస్టుమార్టం

గుత్తి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆరు నెలల కిందట కోట వీధిలోని ఓ బావిలో పడి మరణించిన విద్యార్థి మృతదేహానికి పోలీసులు శనివారం పోస్టుమార్టం నిర్వహించారు. కోటవీధిలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న రాఘవవీరాచారి గత ఫిబ్రవరిలో కోట సమీపంలో ఉన్న ఓ బావిలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. అప్పట్లో ఎటువంటి పోలీసు కేసు లేకుండానే బాలుడికి అంత్యక్రియలు నిర్వహించారు. ప్రస్తుతం ఆ బాలుడి సోదరి త్రివేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసును తిరిగి ప్రారంభించారు. తన తమ్ముడు ప్రమాదవశాత్తు మృతి చెందలేదని హత్య చేసి ఉండవచ్చునని జిల్లా ఎస్పీకి ఆమె ఫిర్యాదు చేశారు. దీంతో శనివారం జిల్లా ఫోరెన్సిక్ నిపుణులు స్థానిక శ్మశాన వాటికలో విద్యార్థి మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముస్తాబవుతున్న గణపయ్యలు

- తుది మెరుగులు దిద్దుతున్న కళాకారులు
- అడ్వాన్స్‌గా బుక్ చేసుకుంటున్న భక్తులు

కదిరి అర్బన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకలు సమీపిస్తుండడంతో పూజలు అందుకోవడానికి గణనాథులు సిద్ధమవుతున్నారు. పట్టణంలోని అనంతపురం, మదనపల్లి రోడ్లతోపాటు పలుచోట్ల వినాయక విగ్రహాల తయారీ ఊపందుకుంది. వివిధ రూపాల్లో 5 అడుగుల నుంచి 20 అడుగుల ఎత్తు వరకు తయారు చేస్తున్నారు. వినాయక చవితి సమీపిస్తుండంతో తయారీదారులు వేగం పెంచారు. విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతున్నారు.



సిద్ధమైన గణనాథులు

ఆకర్షణీయమైన రంగులపై ఆసక్తి

ఉత్సవ కమిటీ సభ్యులు తాము నెలకొల్పే విగ్రహం ఆకర్షణీయంగా ఉండాలని కోరుకుంటున్నారు. దీంతో విగ్రహం ఎంపికపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. కొంతమంది నిర్వాహకులు.. విగ్రహానికి ఎలాంటి రంగులు వేస్తే ఆకర్షణీయంగా ఉంటాయో తెలుసుకునేందుకు టెక్నాలజీని వాడుతున్నారు. ముందుగా కప్యూటర్‌లో గ్రాఫిక్స్ ద్వారా విగ్రహాలు రూపొందించి, ఆ తరువాత కళాకారులకు అవే రంగులు వేయాలని సూచిస్తున్నారు. ఎత్తు, ఆకృతిని బట్టి ధరలు నిర్ణయించి బుకింగ్ చేసుకుంటున్నారు. విగ్రహాల తయారీకి రాజస్థాన్ నుంచి కళాకారులు వస్తున్నారు. కూలీలు కూడా అక్కడి నుంచే మూడు నెలలు ముందుగా వచ్చి తయారీలో నిమగ్నమయ్యారు. వినియోగదారులను ఆకట్టుకునేలా విగ్రహాలను రూపొందిస్తున్నారు. వీటి తయారీలో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో పాటు పీచు, కర్ర, రంగులు వాడుతారు. వినియోగదారులను ఆకట్టుకునేందుకు వ్యాపారులు వివిధ రూపాల్లో విగ్రహాలను తయారు చేస్తున్నారు.



రంగులు అద్దుతున్న మహిళ

పెరిగిన ఖర్చులు

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రంగుల ధరలు పెరిగాయని తయారీదారులు అంటున్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ 25 కిలోల బస్తా రూ.400కి చేరుకుంది. ఈ పౌడర్ రాజస్థాన్ నుంచి వస్తుంది. కళాకారులు, కూలీల రేట్లు కూడా పెంచేశారని తయారీదారులు చెబుతున్నారు. వారికి డిమాండ్ అధికంగా ఉండడంతో కూలీ రేట్లు విపరీతంగా పెంచేశారనీ, ఇవన్నీ భారమని అంటున్నారు.

రంగుల విగ్రహాలపైనే ఆసక్తి: యశ్వంత్, వ్యాపారి



రంగుల వినాయక విగ్రహాలను కొలువు దీర్చేందుకే ఇష్టపడతారు. దీంతో రంగుల విగ్రహాలనే తయారు చేస్తున్నాం. చవితి పండగకు రెండు వారాలే సమయం ఉండడంతో విగ్రహాల తయారీ వేగం పెంచాం. గతంలో కంటే ఈసారి వ్యాపారం బాగా ఉంటుందని ఆశిస్తున్నాం.

టమోటా కిలో రూ.40

అనంతపురం రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటాలు గరిష్ఠంగా రూ.40తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ శనివారం తెలిపారు. కనిష్ఠ ధర రూ.24, సరాసరి రూ.32 పలికాయన్నారు. మార్కెట్‌కు 3,225 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

చీనీ టన్ను రూ.15వేలు

అనంతపురం రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.15,100తో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు శనివారం తెలిపారు. కనిష్ఠంగా రూ.9వేలు, సరాసరి రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 785 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

జీడిపల్లికి 2,361 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు 2,361 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు శనివారం తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 1.811 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు వెల్లడించారు. ఔట్‌ఫ్లో 2,321 క్యూసెక్కులు ఉందన్నారు.

కార్పొరేట్లకు మోదీ ప్రభుత్వం ఊడిగం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

గుంతకల్లుటౌన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సంస్థలకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఊడిగం చేస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. పట్టణంలో సీపీఐ పట్టణ 14వ మహా సభలను శనివారం సాయంత్రం నిర్వహించారు. ముందుగా స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి మొయిన్‌రోడ్డు, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా ఆంధ్రబ్యాంక్ రోడ్డు నుంచి పాత బస్టాండ్‌లోని బహిరంగ ప్రదేశం వరకు ర్యాలీ నిర్వహించారు. బహిరంగ సభలో రామకృష్ణ మాట్లాడుతూ నరేంద్ర మోదీ పేద ప్రజల కోసం పనిచేయడం లేదని కేవలం అంబానీ, అదాని వంటి కార్పొరేట్ సంస్థల కోసమే పని చేస్తున్నాడని ధ్వజమెత్తారు. దేశం మొత్తం దొంగ ఓట్లతో అధికారంలోకి రావాలని చూస్తున్నాడన్నారు. ప్రజలు బీజేపీ మాయ మాటను నమ్మవద్దన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీ మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడి బీజేపీని గద్దెదింపాలని పిలుపునిచ్చారు.

జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు పరిపాలన మొత్తం పోలీసుల చేతిల్లో పెట్టి, బటన్లు నొక్కడం పనిగా పెట్టుకున్నాడని ఎద్దేవా చేశారు. అందుకే ప్రజలు రెండు బటన్లు నొక్కి గద్దె దింపారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇతర దేశాలకు వెళ్లి అప్పులు తెచ్చి రాష్ట్ర ప్రజలపై పెనుభారాన్ని మోపుతోందన్నారు. రాష్ట్రంలో పేద ప్రజల కోసం పోరాడుతున్నది ఒకే ఒక్క పార్టీ అది కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జగదీష్, కౌన్సిల్ సభ్యులు మురళీకృష్ణ, జాన్సన్‌బాబు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాజేష్‌గౌడ్, కౌన్సిలర్ లక్ష్మి, జిల్లా కార్యవర్గ సభ్యుడు బీ గోవిందు. నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేష్, పట్టణ కార్యదర్శి గోపినాథ్, సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్, మండల కార్యదర్శి రాము, సహాయ కార్యదర్శి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న రామకృష్ణ

చీరల చోరీకి మహిళల యత్నం

యాడికి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువులో ఒక వస్త్ర దుకాణంలో మహిళలు చోరీకి యత్నించిన విషయం సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. దుస్తులు కొనడానికి ముగ్గురు మహిళలు శనివారం ఆటోలో వచ్చినట్లు స్థానికులు తెలిపారు. దుస్తులు కొనుగోలు చేస్తున్నట్లు నటించి దుకాణ యజమానిని మాటల్లో పెట్టి మూడు చీరలను దొంగిలించినట్లు తెలిపారు. దీనిని పసిగట్టిన యజమాని ముగ్గురు మహిళలను నిలదీయడంతో తస్కరించిన చీరలను వెనక్కి ఇచ్చినట్లు తెలిపారు. స్థానికులు ఆ మహిళలను పోలీసులకు అప్పగించాలని చర్చించుకుంటుండగానే వారు వచ్చిన ఆటోలో పరారైనట్లు తెలిపారు. ఇదే విషయాన్ని సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. యాడికిలో పెద్దఎత్తున పట్టుచీరల దుకాణాలు ఉండటంతో యజమానులు అప్రమత్తమయ్యారు.

బీటీపీకి పెరుగుతున్న వరద

గుమ్మఘట్ట, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): బైరవాన్ తిప్ప ప్రాజెక్టుకు వరద నీటి ప్రవాహం పెరిగింది. కర్ణాటక ప్రాంతాల్లో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వేదవతి హగరి నది ఉధృతంగా ప్రవహిస్తూ బీటీపీకి చేరుతోంది. ప్రాజెక్టులోకి శనివారం సాయంత్రానికి 1646 అడుగుల మేర నీరు చేరినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు నీటిమట్టం 1656 అడుగులు కాగా 2 టీఎంసీల నీటి సామర్థ్యంతో ఉంది. ప్రస్తుతం వరద నీరు పెరుగుతుండడంతో ఈ క్షణంలోనైనా ప్రాజెక్టు నిండే అస్కారం ఉంది. ప్రాజెక్టు పరిధిలో కుడి, ఎడమ కాలువల కింద 12వేల ఎకరాల ఆయకట్టు సాగునీరు అందుతుంది.

ఆలయంలో చోరీ

కుందుర్పి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగుంట గ్రామంలో మారెమ్మ ఆలయంలో శనివారం దొంగతనం జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామ శివారు ప్రాంతంలో ఉన్న ఆలయం తలుపులు పగులగొట్టి బీరువాలో ఉన్న రెండుతులాలు బంగారు నగలు, మూడు కిలోల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

జీతం రావాలంటే సమ్మె చేయాల్సిందే

- సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు

తాడిమర్రి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): జీతం రావాలంటే సమ్మె చేయాల్సిందేనా అని సత్యసాయి తాగునీటికార్మికులు వాపోతున్నారు. ఈ తాగునీటి పథకంలో జిల్లాలో 550 మంది స్కిల్డ్, సెమీస్కిల్డ్, అన్‌స్కిల్డ్ కార్మికులుగా పనిచేస్తున్నారు. వీరు తాడిమర్రి, బత్తలపల్లి, ముదిగుబ్బ, కొత్తచెరువు, పుట్టపర్తి, ధర్మవరం ప్రాంతాలకు సక్రమంగా తాగునీటి సరఫరా చేయడంలో కీలకంగా వ్యవహరిస్తారు. ఎక్కడ పైప్‌లైన్ పగిలినా రిపేరీ వీరి బాధ్యతే. వీరు పని చేయకపోతే ఆయా ప్రాంతాలకు తాగునీటి సరఫరా బంద్ అవుతుంది. ఇంతటి కీలకంగా పని చేస్తున్న వీరికి ప్రతి నెలా జీతం మాత్రం సక్రమంగా అందడం లేదు. ఎప్పటికప్పుడు ధర్నాలు, నిరసనలు తెలిపితే తప్పా వేతనం అందని పరిస్థితి. గతనెల నుంచి వేతనం ఇవ్వాలని కోరుతున్నా పట్టించుకునే వారులేరు. దీంతో జీవనానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వారు వాపోతున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యే సమయానికి ఏడు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉండేవి. ప్రభుత్వం ఏర్పాటైన కొత్తలో ఏడునెలల వేతనాలు ఇవ్వడంతో పాటుగా ఆ తరువాత ఏడు నెలలపాటు బాగానే వచ్చాయి. ప్రస్తుతం మళ్లీ అదే పరిస్థితి నెలకొంది.



తాడిమర్రి మెయిన్ పంప్‌హౌస్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

కార్మికులతో అధికారుల చర్చలు

సత్యసాయికార్మికులు ఆదివారం అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి వెళ్తున్నారని సమాచారం రావడంతో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, డీఈ, కాంట్రాక్టర్‌లు కలిసి శనివారం సాయంత్రం అనంతపురంలో వారితో చర్చలు జరిపారు. ఒక నెల వేతనం మాత్రమే ఇవ్వడానికి అంగీకరించడంతో తాము సమ్మెలోకి వెళ్తామని కార్మికులు ఖరాఖండిగా తెలిపారు. దీంతో ఈనెల 16న అనంతపురం జిల్లా కలెక్టర్ తిరిగి రానున్నారని, ఆయనతో చర్చల అనంతరం నిర్ణయం తీసుకోవాలని వారు కార్మికులను కోరారు. దీనికి కార్మికులు అంగీకరించారు.

ఎదురు చూపులే...



ప్రతి నెలా ఒకటో తేదీనే వేతనం వస్తుందని అందరు అనుకుంటారు. కానీ మాకు ఎప్పుడు వస్తుందో తెలియదు. నిరసన అయినా తెలపాలి, ధర్నా అయినా చేయాలి. లేదా నీటిసరఫరా ఆపివేయాలి. అప్పుడు మాత్రమే వేతనాలు వస్తున్నాయి. ఈనెల 1వతేదీ నుంచి నిరసన తెలుపుతున్న మా గురించి పట్టించుకునేవారు లేరు. -మహేశ్వరరెడ్డి, సత్యసాయి స్కిల్డ్ కార్మికుడు

మరమ్మతులకు డబ్బులు ఇవ్వలేదు



అప్పోసప్పో చేసి కుటుంబ అవసరాలను తీర్చుకుంటున్నాం. పైపులైన్ మరమ్మతులకు కూడా అప్పు చేయాల్సి వస్తోంది. ఈ విషయం అధికారులకు తెలిపినా ఏ ఒక్కరు స్పందించరు. ఎక్కడైనా రిపేర్లు వస్తే చేయమని దండిస్తారే కానీ మా గురించి పట్టించుకోరు. -ప్రసాద్, సత్యసాయి కార్మికుడు

సంక్షిప్త వార్తలు

పండ్లతోటల పరిశీలన



దానిమ్మ తోటను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

పుట్లూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని మడుగుపల్లి, మడ్డిపల్లి పంచాయతీల్లో శనివారం కేంద్రబృందం సభ్యులు పర్యటించారు. ఈ సందర్భంగా కేంద్ర బృందం సభ్యులు సాంబశివరావు, సబ్బటి నవ్య ఉపాధి హామీ పథకం కింద సాగుచేసిన పండ్ల తోటలను పరిశీలించారు. అనంతరం సచివాలయంలో గ్రామసభలు నిర్వహించి మాట్లాడారు. ఉపాధిహామీ పనులు జరుగుతున్న తీరుపై గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. జాబ్‌కార్డులు, రికార్డులను తనిఖీచేశారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివప్రసాద్, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు

గుంతకల్లు టౌన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): సెలూన్ షాపులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అమలుకు జీఓ విడుదల చేసిన నేపథ్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం పట్టణ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. కూటమి ఇచ్చిన హామీల్లో మొదటి దేవాలయాల్లో పనిచేసే నాయీబ్రాహ్మణులకు రూ.25వేలు జీతం పెంచారని, సెలూన్ షాపులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ జీఓను ప్రభుత్వం విడుదల చేయడం సంతోషకరం అన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు వేణుగోపాల్, మాణిక్యం, ప్రమేష్‌బాబు, వీరాంజినేయులు, రవికుమార్, పాఠశాల కమిటీ ఛైర్మన్ ఎం. నాగరాజు పాల్గొన్నారు.

మాదిగల సదస్సును జయప్రద్రం చేయండి

గుత్తి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఈనెల17న జిల్లా అనంతపురంలో నిర్వహించనున్న మాదిగల చైతన్య సదస్సును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు నాగేంద్ర, ఓబులేసు కోరారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. మాదిగల చైతన్య సదస్సుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరవుతారన్నారు. మండలంలోని ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలుపెద్ద ఎత్తున పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఈరన్న, అయ్యప్ప, రంగుడు, చంద్ర, సుధాకర్, రాజు, లక్ష్మన్న పాల్గొన్నారు.

గుండెపోటుతో ఆశావర్కర్ మృతి

కుందుర్పి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఆశా వర్కర్ పుట్టీరమ్మ (54) శనివారం గుండె పోటుతో మృతి చెందారు. కుటుంబసభ్యుల వివరాల మేరకు.. గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తరలించేలోపు మృతి చెందిందని తెలిపారు. పది సంవత్సరాలుగా ఆమె ఆశావర్కర్‌గా పనిచేస్తుండేది. ఆమెకు నలుగురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. వైద్య సిబ్బంది ఆమె భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుల అరెస్ట్

యాడికి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్‌షాపు నిర్వాహకులు ఇద్దరిని శనివారం అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న శ్రీనివాసులు అనే వ్యక్తిని అరెస్ట్‌చేసి అతడి వద్ద నుంచి 14 క్వార్టర్ మద్యం బాటిళ్లను సీజ్‌చేసినట్లు వివరించారు. కుళ్లాయిస్వామి అనే మరో వ్యక్తిని అరెస్ట్‌చేసి అతడివద్ద నుంచి 7 మద్యం బాటిళ్లను, మూడు బీర్లను సీజ్‌చేసినట్లు తెలిపారు. ఇరువురిపై కేసు నమోదుచేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

శ్రీకృష్ణాష్టమి పోస్టర్ల ఆవిష్కరణ

కళ్యాణదుర్గంరూరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీకృష్ణాష్టమి వేడుకలకు సంబంధించిన పోస్టర్లను శనివారం సీఐ నీలకంఠేశ్వర్ ఆవిష్కరించారు. పట్టణంలోని కోట వీధిలో ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు జరుగు వేడుకలకు సీఐని ఆహ్వానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మేఘరాజు, గణేష్, రామ్మోహన్‌రెడ్డి, సాయి, మారుతి, ఆది, రమేష్ పాల్గొన్నారు.

నలుగురు జూదరుల అరెస్ట్

బ్రహ్మసముద్రం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముప్పలకుంట గ్రామ శివారులో పేకాట ఆడుతున్న నలుగురు జూదరులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. జూదరుల నుంచి రూ. 18,070 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

దేవగిరిలో ఆంజనేయస్వామి జలధి ఉత్సవం

బొమ్మనహాళ్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవగిరి గ్రామంలో ఆంజనేయస్వామి జలధి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏటా శ్రావణ మాసం మూడో శనివారం ఆంజనేయస్వామి జలధి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఉదయం వేదావతి హగరి నుంచి అర్చకులతో గంగాజలాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చి స్వామిని అభిషేకించి పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామంలో జలధి ఉత్సవ ఊరేగింపు నిర్వహించారు. ఉప్పరహాళ్ గ్రామంలో వెలసిన నరసింహస్వామి జల్ది ఉత్సవం వైభవంగా జరిగింది. ఉదయం స్వామి వారి విగ్రహాలను వేదావతి హగికి తీసుకెళ్లి నది గంగాజలంతో అభిషేకం జరిపించారు. స్వామిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.



వేదవతి నుంచి గంగాజలం తెస్తున్న అర్చకులు



విడపనకల్లులో మునిగిన పంట పొలాలు



కంబదూరు వద్ద కొట్టుకుపోయిన టమోటా మొక్కలు

● కొట్టుకుపోయిన అరటి, టమోటా మొక్కలు
● రాకపోకలకు అంతరాయం

పంటలను ముంచెత్తిన వాన

కళ్యాణదుర్గం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): వర్షం చాలా మంది రైతులకు ఊరటనిచ్చినా.. కొందరు పండ్లతోటల రైతులు నష్టపోయారు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి కంబదూరు మండల పరిధిలోని రాంపురం గ్రామంలో అరటి, టమోటా పంటలన్నీ దెబ్బతిన్నాయి. ఇదే గ్రామానికి చెందిన రైతు మనోజ్ తనకున్న ఐదెకరాల పొలంలో టమోటా, అరటి పంటలను సాగు చేశాడు. టమోటాకు రూ.2 లక్షలు, అరటి పంటకు రూ.4 లక్షలు ఖర్చు చేసి సాగు చేశాడు. భారీ వర్షానికి ఈ రెండు పంటలు పూర్తిగా దెబ్బతిన్నా యి. అరటి మొక్కలన్నీ పూర్తిగా నేల మట్టమయ్యాయి. టమోటా మొక్కలన్నీ వర్షం దెబ్బకు కొట్టుకుపోయాయి. సుమారు రూ.4 లక్షల వరకు నష్టపోయానని రైతు తెలిపాడు.

● విడపనకల్లు: మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో వంకలు వాగులు పొంగి పొర్లాయి. కొన్ని గ్రామాలకు రాక పోకలు నిలిచి పోయాయి. అంచనహాలు-పొలికి గ్రామాల మధ్య ఉన్న పెద్ద వంక ఉధృతంగా పొంగి పారుతుండడంతో ఉదయం నుంచి ఆ గ్రామాలకు రాక పోకలు నిలిచి పోయాయి. గుంతకల్లుకు వెళ్లే ప్రయాణికు లు ఉరవకొండ మీదుగా వెళుతున్నారు. పొలాలు వర్షపు నీటినితో నిండి చెరువులను తలపిస్తున్నాయి. విడపనకల్లు, ఆర్.కొట్టాల, పాల్తూరు, ఉండబండ, చీకలగురికి గ్రామాల వంకలు ఉధృతంగా పారటంతో మధ్యాహ్నం వరకూ ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

● గుత్తిరూరల్: మండలంలోని బేతాపల్లి, బసినేపల్లి, ఊటకల్లు, ఊబిచెర్ల, చేట్నేపల్లి తదితర గ్రామాలల్లో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి వా గులు, వంకలు పారి, వేరుశనగ పంట తడిసి పోయింది. గుత్తి మండల వ్యాప్తంగా 19.4 మీలిమీటర్లు వర్షపాతం నమోదయినట్లు తహసీల్దార్ పు ణ్యవతి తెలిపారు. వేరుశనగ పంటను తొలగించారు. మండల వ్యాప్తంగా సుమారు 150 ఎకరాలల్లో వేరుశనగ పంట తడిసి పోయింది.

● గుత్తి: మండలంలో శుక్రవారం రాత్రి 19.4 మిల్లి మీటర్ల వర్షం కురిసింది. పలుచోట్ల వాగులు, వంకలు పొంగిపొర్లాయి. గుత్తి, గుంతకల్లు రో డ్డులో వర్షం నీరు నిలిచిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

● రాయదుర్గం రూరల్: వద్రవన్నూరు, బొమ్మక్కపల్లి, లింగంపల్లి, కెంచానపల్లి, కదరంపల్లి, వేపరాల, ఆర్‌బీవంక, టి.వీరాపురం త ది తర గ్రామాలలో శుక్రవారం రాత్రి మోస్తరు వర్షం కురవడంతో ఆయా గ్రామాల్లోని వంకలు, వాగుల్లో నీరు చేరాయి. ఉపాధి పథకంలో ఏర్పాటు చేసిన పంట కుంటలు, చెక్‌డ్యాముల్లో నీరు చేరి జలకళ సంతరించుకుంది. వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వర్షం పడితే ఆ వంతెన దాటడం కష్టమే..!



వరదనీటిలో ఇబ్బంది పడుతున్న ద్విచక్ర వాహనదారులు

కళ్యాణదుర్గం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కంబదూరు మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి మల్లేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఉన్న రైల్వే వంతెన కిందకు భారీగా వర్షపు నీరు చేరింది. దీంతో రైతులు, వాహనదారులు, ప్రజలు వరదనీటిలో ప్రయాణించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరదనీటిలో ప్రయాణించిన ద్విచక్ర వాహనాలు మొరాయించడంతో చాలాసేపు ఇబ్బందిపడ్డారు. పలువురు వాహనదారులు మాట్లాడుతూ.. వర్షం పడినప్పుడు రైల్వే వంతెనను దాటడానికి తీవ్ర పడుతున్నామని అన్నారు. వరదనీటిలో నడవలేక రైల్వే వంతెనపై ఉన్న మెట్ల ద్వారా రోడ్డును దాటుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ప్రజలు వాపోతున్నారు. వరదనీటిలో వెళ్లలేక కొన్ని వాహనాలు వెనక్కు తిరిగివెళ్లాయి. రైల్వే వంతెనకు సంబంధించిన రోడ్డును కాంట్రాక్టర్లు ప్రణాళిక ప్రకారం నిర్మించకపోవడంతో ఈ దుస్థితి నెలకొందని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం చేపడుతున్న కాలువ నిర్మాణ పనులను సక్రమంగా చేయాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

వెంకటేశ్వరస్వామి ఊరేగింపు



హనుమాపురంలో వెంకటేశ్వరస్వామిని ఊరేగిస్తున్న గ్రామస్థులు

కణేకల్లు, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): మండలంలోని హనుమాపురం గ్రామంలో శ్రావణ మాసం మూడో శనివారం సందర్భంగా శ్రీదేవి,భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం గంగాజలం తెచ్చి స్వామికి పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి, సమేత వెంకటేశ్వరస్వామి కళ్యాణమహోత్సవం నిర్వహించారు. సాయంత్రం గ్రామంలో ఉత్సవ విగ్రహాలతో ఊరేగించారు. ఆదివారం వసంతోత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జయరాంచౌదరి, ఎంపీటీసీ నరేంద్ర, టీడీపీ నాయకులు రఘునాథ్, రామచంద్ర, దేవదాసు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి పల్లకి సేవ



ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

ఉరవకొండ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెన్నహోబిలం లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం పల్లకీసేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకీలో కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య ఉత్సవమూర్తులను ఆలయం చుట్టూ ఊరేగించారు.

ఉరవకొండలో గిరి ప్రదక్షిణ

ఉరవకొండ పట్టణంలోని కొండపై వెలసిన బడేసోమేశ్వరస్వామి గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొండపై వెలిసిన బడేసోమప్ప ఆలయం వద్ద పూజలు నిర్వహించి, కమిటీ సభ్యులు గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మార్కండేస్వామి, రామలింగేశ్వరస్వామి, నీలకంఠేశ్వరస్వామి, మలేశ్వరస్వామి, వీరభద్రస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, నంజుండేశ్వరస్వామి, గవిసిద్ధేశ్వరస్వామి ఆలయాలను సందర్శిస్తూ 3.కి.మీ. మేర గిరిప్రదక్షిణ సాగింది.

ఘనంగా శ్రావణ మాస పూజలు



ప్రత్యేకాలంకరణలో ఆంజనేయస్వామి

రాయదుర్గం రూరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వద్రవన్నూరు గ్రామ సమీపంలో వెలిసిన అపులాపురం ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రావణమాస శనివారం సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్లాపురం గ్రామ సమీపంలో వెలిసిన విప్రమలై లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామికి ఉదయాన్నే పంచామృతాభిషేకం, కుంకుమార్చన, వస్త్రాలంకరణ ఆకుల పూజ, పుష్పాలంకరణ తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు దేవాలయాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మూడో శనివారం సందర్భంగా వేలాదిగా తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● యాడికి : శ్రావణ పౌర్ణమి సందర్భంగా యాడికిలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేక అలంకరించి పూజలు నిర్వహించారు. సామూహి క సత్యనారాయణస్వామి వ్రతంతోపాటు రాఖీవేడుకలను ఘనంగా నిర్వహించా రు.

● బెళుగుప్ప : మండలంలో శనివారం శ్రావణమాస పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి హనుమాన్ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మూడో వారం భక్తులు నాగుల పండుగ వైభవంగా నిర్వహించారు. నాగుల విగ్రహాలకు పాలుపోసి తీర్థప్రసాదాలు అందజేశారు. బూదిగుమ్మ సంజీవరాయ స్థానిక వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

హర్ ఘర్ తిరంగా యాత్ర చేపట్టాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు అంకాల్‌రెడ్డి

గుత్తి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): హర్ ఘర్ తిరంగా యాత్రను చేపట్టాలని బీజేపీ జాతీయ కార్యదర్శి జంగంరెడ్డి అంకాల్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శనివారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా యాత్రపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంకాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఇంటిపైన జాతీయ జెండాను ఎగురవేసేలా చూడాలన్నారు. కేంద్రప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. 11న మండలంలోని బసినేపల్లి, తొండపాడు, వన్నెదొడ్డి గ్రామాలలో హర్ ఘర్ తిరంగా యాత్ర ర్యాలీలు చేపట్టాలన్నారు. 14న పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బాలమోరి చంద్రశేఖర్, బీసీ వెంకప్ప, నారాయణరెడ్డి, రంగరాజు, ఓబులయ్య, తిమ్మారెడ్డి, బాలకృష్ణ, బాపయ్య పాల్గొన్నారు.

● తాడిపత్రి : పట్టణంలో నిర్వహించే హర్‌ఘర్ తిరంగా ర్యాలీలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. స్థానిక నివాసంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్ర ధాని నరేంద్రమోదీ పిలుపుమేరకు దేశం మొత్తం హర్‌ఘర్ తి రంగా ర్యాలీ నిర్వహిస్తున్నారన్నారు. తాడిపత్రిలో నిర్వహించే ర్యా లీకి పెద్దఎత్తున ప్రజలు తరలిరావాలన్నారు. సమావేశంలో నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, అంజనేయులు, రంగనాథ్‌రెడ్డి, శింగరి లక్ష్మీనారాయణ, రామాంజనేయులు, నారాయణస్వామి, గంగాధర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పూడికతీత పనులకు శ్రీకారం

పుట్లూరు, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్బరాయ సాగర్ చెరువు నుంచి బొప్పేపల్లి వరకు 0.1టీఎంసీల నీరు కేటాయిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసిన విషయం విదితమే. వీటికి సంబంధించి పూడికతీత పనులకు ఆదివారం శ్రీకారం చుట్టనున్నట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పాల్గొని పనులను ప్రారంభిస్తారని తెలిపారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి.

నరసింహస్వామికి ప్రత్యేక పూజలు



గుత్తి రూరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేటలో వెలసిన నవ అహోబిల లక్ష్మీనరసింహస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం సందర్భంగా స్వామికి వేకువజామున పంచామృతాభిషేకం, వివిధ పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు.

కళకళలాడుతున్న పంటలు



గంజికుంట సమీపంలో కంది పంట

ఉరవకొండ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో గత రెండ్రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో పంటలు కళకళలాడుతున్నాయి. వర్షాలతో పంటలకు ఊపిరి పోసినట్లయింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన తర్వాత నెలన్నరకు పైగా వర్షాలు కురవక పోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. పంటలు కూడా ఎండుముఖం పట్టాయి. ఉరవకొండ డివిజన్‌లో 55,147 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగు చేశారు. ఖాళీగా ఉన్న భూముల్లో ఇతర పంటలు సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి, వాల్మీకి విగ్రహాల ప్రతిష్ఠ



వాల్మీకి విగ్రహనికి పూలమాల వేస్తున్న ప్రభుత్వ విప్ కాలవ

బొమ్మనహాళ్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరహాళ్ గ్రామంలో శనివారం స్థానిక వాల్మీకుల ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి, వాల్మీకి మహర్షి విగ్రహాలను ప్రతిష్ఠించారు. వేద పండితుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. అనంతరం విగ్రహాల ప్రతిష్ఠ నిర్వహించారు. ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆంజనేయస్వామి, వాల్మీకి విగ్రహాలను దర్శించుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేశవరెడ్డి, బలరాంరెడ్డి, మల్లికార్జున, ధనంజయ, మోహన్, వెంకటేశులు, నాగరాజుస్వామి, భవాని, మహేంద్ర, నాగరాజు, నవీన్, హనుమంతు, సంగప్ప పాల్గొన్నారు.

●కణేకల్లు : రాఖీ పౌర్ణమి సందర్భంగా కణేకల్లు క్రాసింగ్‌లో మహిళలు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులుకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకులు అనంద్, మారుతి, తిప్పారెడ్డి, ప్రతాప్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీనివాసుడి కల్యాణోత్సవం





కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

ఉరవకొండ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. లక్ష్మీనారాయణ హోమం, వరుణ యాగం, కుబేర హోమాలను నిర్వహించారు. లోక కల్యాణార్థం హోమాలు నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతుడైన స్వామిని పట్టు వస్త్రాలతో అలంకరించారు. ఆలయ కమిటీ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టింది.

డ్రై ఫ్రూట్స్‌తో వెంకటేశ్వర స్వామికి అలంకరణ



గుంతకల్లుటౌన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసాన్ని పురస్కరించుకుని స్థానిక రాజేంద్రనగర్‌లో వెలసిన వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామికి డ్రై ఫ్రూట్స్‌తో అలంకరించారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు



మంత్రిని కలిసిన కొనకొండ్ల రాజేష్

కూడేరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ నియోజక వర్గంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతుండడంతో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ ధన్యావాదాలు తెలిపారు. శనివారం అనంతపురంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ.. ఉరవకొండ నియోజక వర్గంలో తాగు నీటి సమస్య పరిష్కారంతో పాటు హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు, రహదారులు, సీసీ రోడ్లు, తదితర పనులు వేగవంతం చేశారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతోందని అన్నారు.

పైలట్‌కు సన్మానం



పైలట్, ఆమె తల్లిదండ్రులను సన్మానిస్తున్న పెన్షనర్లు

తాడిపత్రి, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన మనోహర్‌రెడ్డి, రమాదేవి దంపతుల కూతురు సాయి హరిత పైలట్‌గా ఎంపికకావడంతో స్థానిక పెన్షనర్ల భవనంలో శనివారం ఆమెను ఘనంగా సన్మానించినట్లు అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సాయిహరితతో పాటు ఆమె తల్లిదండ్రులకు శాలువాకప్పి పూల బొకేతో ఘనంగా సత్కరించారు. ఆడపిల్లలు అనుకుంటే ఏదైనా సాధిస్తారని పలువురు తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు నరసింహులు, శివయ్య, ఆదినారాయణ స్వామి, చంద్రశేఖర్, రమణరాజు, వెంకటరామయ్య పాల్గొన్నారు.